గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఏప్రిల్ 2014
# కథలు




www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com ww

బైట ఓ పది కార్ల వరకూ ఉన్నాయి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ జనం.. హడావిడి. ఇంతకీ ఇవన్నీ ఎందుకని అనుకుంటున్నారా? హేమంత్ గారి కొత్త ఇంటి గృహప్రవేశం మరి.

అతను చాలా డబ్బు.. పలుకుబడి ఉన్న వ్యక్తి. ఇవన్నీ ఉన్న వారికి శత్రువులు లేకుండా ఎలా ఉంటారు? కరక్టే ! 'ఆయన్ని ఎప్పుడు తొక్కి పైకి ఎదుగుదామా' అని ఆఫీసులో అందరూ కాచుకుని ఉంటారు. అతని పి.ఏ కూడాను ! ఆయన చాలా తెలివైన వాడు.. అందుకే ఆయన ఎవరికీ చిక్కడూ దొరకడూ.

అందరూ సంతోషంగా గృహప్రవేశంలో పాల్గొంటున్నారు. ఎప్పుడూ సీరియస్‌గా వుండే హేమంత్ మొట్టమొదటి సారిగా నవ్వుతూ ఉన్నాడు.

కార్యక్రమం అయిపోయాక అందరూ ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోయారు. ఇప్పుడు ఇంట్లో హేమంత్.. ఆయన కుటుంబ

సభ్యులు.. అతని పీ.ఏ మరియు పంతులూ మాత్రమే ఉన్నారు.

"ఏమండీ.. సామానులన్నీ సర్దేసినట్టే.. కానీ మీ బుక్‌షెల్ఫ్ ఎక్కడ పెట్టాలో తెలియట్లేదు." అంది హేమంత్ భార్య శ్రావ్య.

"నీకు తెలుసు కదా.. నాకు సంబంధించిన వస్తువులన్నీ నా గదిలోనే ఉండాలని!" అన్నాడు హేమంత్.

"తెలుసండీ..కానీ మీ గదిలో ఖాళీ స్థలం లేదు!" అంది శ్రావ్య.

వెంటనే హేమంత్ అతని గది తలుపు తెరిచాడు.

"స్థలం లేదన్నావ్.. ఆ మూల బుక్‌షెల్ఫ్ పడుతుందే..!" అన్నాడు హేమంత్.

"కానీ అది ఈశాన్యం మూల కదండీ..ఆ మూల మనం బరువు పెడితే ధననష్టం వస్తుందంటారుగా!" అంది శ్రావ్య.

"ఏంటీ...?? అక్కడ మనం బరువు పెడితే ఇక్కడ మనకి ధననష్టం వస్తుందా? ఇలాంటి మూఢనమ్మకాలన్నీ పట్టించుకుంటే నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉండేవాడిని కాదు. ఇక సమయం వృధా చేయకుండా బుక్‌షెల్ఫ్ పెట్టేద్దాం!" అన్నాడు హేమంత్.

"నాయనా! వాస్తు ప్రకారం ఈశాన్యం మూలన బరువు పెట్టకూడదు. పెట్టినచో.. భారీ మూల్యం చెల్లించక తప్పదు!" అన్నాడు పంతులు హెచ్చరిస్తూ.

"సార్..వీళ్ళు చెప్పింది నిజమే.. మా మామగారు ఓ సారి.." అని పీ.ఏ చెబుతూండగానే.. హేమంత్‌గారి అబ్బాయి గోపాల్ మధ్యలో దూరి "సార్... ఏది ఏమైనా సరే.. నాన్నగారికి ఇష్టమున్నట్లు ఆయన్ని చేయనివ్వండి. ధననష్టం వచ్చినా అది మీ జేబులకేం చిల్లు పెట్టదే! ఇది ఆయన ఇల్లు. ఇది ఆయన గది!" అన్నాడు హేమంత్‌గారి అబ్బాయి గోపాల్.

"కరక్ట్ రా! వీళ్ళందరికీ అర్థం కాదులే! నేను ఇప్పుడు ఆ బుక్‌షెల్ఫ్ ని ఈశాన్యంలోనే పెడతాను. త్వరలో ప్రమోషన్ కూడా కొడతాను. ఈశాన్యంలో బరువు పెడితే ధననష్టం రాదని.. ధనలాభం వస్తుందని నిరూపిస్తాను!" అంటూ బుక్‌షెల్ఫ్ ని ఈశాన్యంలో పెట్టాడు హేమంత్.

"నాయనా.. గుర్రాన్ని చెరువు వరకూ తీసుకువెళ్ళగలములే కాని.. నీళ్ళు త్రాగించగలమా?! నీ ఇల్లు.. నీ ఇష్టం! నాకు ఇవ్వాల్సింది నాకు ఇస్తే నేను బయలుదేరుతాను..!" అని అన్నాడు పంతులు.

"సరే.. ఇదిగోండి.. మీకు ఇవ్వాల్సిన రెండు వేలు." అంటూ డబ్బుని పంతులు చేతిలో పెట్టాడు హేమంత్.

"రెండువేలా??? మీరు నాకు ఇవ్వాల్సింది మూడువేలు కదా!" అన్నాడు పంతులు ఆశ్చర్యంగా.

"మూడువేలా?! నిన్న రాత్రిగా.. రెండువేలు సరిపోతాయన్నారు!" అని అడిగాడు హేమంత్.

"నాయనా.. నువ్వు సరిగ్గా విన్నట్టులేవు.. నిన్న రాత్రి కార్యక్రమానికి రెండు వేలు.. ఇవాళ వ్రతానికి వెయ్యి.. మొత్తం మూడు వేలు అని చెప్పాను!" అని అన్నాడు పంతులు.

"ఏమండీ.. ఈశాన్యం ప్రభావం మొదలైనట్టుంది. బుక్‌షెల్ఫ్ ఈశాన్యం వైపు పెట్టి అరనిమిషం అయ్యిందో లేదో.. అప్పుడే ఇలా..!" అంది శ్రావ్య భయంతో.

"అమ్మా.. నేనేం సమయం అనుకూలించిందని మూడువేలు అడగట్లేదు.. నిన్న రాత్రే ఈయన్ని అడిగాను. గుర్తుతెచ్చుకోమనండి!" అన్నాడు పంతులు.

"శ్రావ్యా.. ఈశాన్యంలో బరువు పెట్టినందుకు ఆయన మూడువేలు అడుగుతున్నారంటే.. బరువు తీసివేస్తే రెండు వేలే అడుగుతారుగా?!" అని వెటకారంగా అడిగాడు హేమంత్.

"నాయనా..నువ్వు ఈశాన్యంలో పెట్టినా.. నైరుతిలో పెట్టినా.. నాకు ఇవ్వాల్సింది మూడువేలు. అవి ఇచ్చేస్తే నేను బయలుదేరుతాను!" అన్నాడు పంతులు.

"సరెలేండి...ఇదిగో..!" అంటూ ఆ డబ్బుకి మరో వెయ్యి రూపాయలు కలిపాడు హేమంత్.

సంతోషంగా ఇంటికి వెళ్ళాడు పంతులు.

"ఏమండి.. ఏమిటండీ ఇది?!" అంటూ ఆపేసింది శ్రావ్య.

"చూడు శ్రావ్య.. ఎవ్వరూ వెయ్యికి కక్కూర్తి పడరు.. అందులో ఆయన పంతులు.. ఈశాన్యంలో బరువు పెట్టినా పెట్టకపోయినా.. ఆయన మూడువేలే అడుగుతారు. ఇక దాని గురించి మాట్లాడకు!" అన్నాడు హేమంత్.

ఆ మర్నాడు.. హేమంత్ అతని పి.ఏ. తో ఆఫీస్‌లో ఉండగా...

"సార్.. సెక్షన్ 4 లో నాలుగు కాంపొనెంట్స్ పోయాయి!" అన్నాడు పి.ఏ.

"మన సెక్షన్‌లో కాంపొనెంట్స్ పోవడమా? అదీ నాలుగా? ఎలా?" అని ఆశ్చర్యంగా అడిగాడు హేమంత్.

"అవును సార్. ఎలా జరిగిందీ రిపోర్ట్స్ రావడానికి రెండు రోజులు పట్టవచ్చు. కాని రేపే మన ప్రాజెక్ట్ పంపించాలి." అన్నాడు పి.ఏ.

"ఓ...అయితే ఇక ఆలస్యం చేయకుండా వెంటనే నాలుగు కాంపొనెంట్స్ తెప్పించు!" అని అయిదువేలు చేతిలో పెట్టాడు హేమంత్.

"సార్.. ఎప్పుడూ కాంపొనెంట్స్ పోని మన ఆఫీసులో ఇలా జరిగిందంటే.. ఈశాన్యంలో మీరు పెట్టిన...!" అంటూ ఆపేశాడు పి.ఏ.

"మనవాళ్ళ అజాగ్రత్తకి అక్కడెక్కడో నా గదిలో ఉన్న బుక్‌షెల్ఫ్ ఎలా కారణమవుతుంది? ఇక దాని గురించి మాట్లాడకు!" అని విసుక్కుంటూ అన్నాడు హేమంత్.

అంతటితో ఆగకుండా అది ఇంకా అలాగే కొనసాగింది. మాటి మాటికీ చిన్న చిన్న తప్పుల వలన కాంపొనెంట్స్ పోవడం.. కార్ పాడవడం.. సిస్టం క్రాష్ అవ్వడం.. యాదృచ్ఛికమని అనలేము. కాని.. హేమంత్ ఓటమి అంగీకరించలేదు. వీళ్ళు చేసే పొరబాటులకి.. ఈశాన్యంలో పెట్టిన బరువుకి సంబంధం లేదని వాదించేవాడు.

ఆ రోజు రాత్రి... భోజనాలు చేస్తుండగా..

"నాన్నగారు..మా ట్యుటోరియల్ ఫీజ్.. ఇంకా ల్యాబ్ ఫీజ్ పెంచారు. అంతేకాదు.. వచ్చే పరీక్షలకి వెయ్యి రూపాయలు కట్టాలి!" అని అడిగాడు గోపాల్.

"హుఁ..మళ్ళీ ఫీజు పెంచారా?! సరే.. మొత్తం ఎంత కావాలో చెప్తే.. తినంగానే ఇస్తాను.. రేపు కట్టేసి రిసిప్ట్ తీసుకురా!" అని అన్నాడు హేమంత్.

"కానీ నాన్నగారు.. ఎప్పుడూ ఫీజ్ పెంచకుండా ఎప్పుడు ఇంతలా పెంచి.. దానితోపాటు పరీక్షలకి కూడా వెయ్యి రూపాయిలు అడిగారంటే దానికి కారణం మీరు ఈశాన్యంలో బరువు పెట్టడమేనా?!" అని ప్రశ్నించాడు గోపాల్.

"ఔనండీ.. నాకు కూడా అదే అనిపిస్తుంది!" అంది శ్రావ్య.

"చూడండి.. అక్కడ నేను బరువు పెట్టినా పెట్టకపోయినా ఇవన్నీ జరుగుతాయి. నేను పెట్టాను కాబట్టి ఇలా జరుగుతున్నాయంటే నేనొప్పుకోను!" అన్నాడు హేమంత్.

"ఒకటీ - రెండు ఐతే యాదృచికం అనుకోవచ్చు కాని మరీ వరసగా ఇన్ని అయితే ఎలా అనుకోగలుగుతామండీ? అన్నట్లు

చెప్పడం మరిచిపోయాను.. మనకి కరెంట్ బిల్లు మూడువేలు వచ్చింది. దీనికేం చెబుతారు?!" అని అడిగింది శ్రావ్య.

"మూడు వేలా..??? అదా... అది... కొత్త ఇంట్లో అడుగుపెట్టి నెలే అయ్యిందికదా.. అందులోనూ బంధువులతో హడావిడిగా ఉంది.. ఆ మాత్రం వస్తుందిలే!" అని సమర్ధించుకున్నాడు హేమంత్.

మరుసటిరోజు హేమంత్ మరియు అతని పి ఏ కారులో వెళుతూ ఉండగా..

"సార్..మీకింకో చెడు వార్త. డేటాబేస్ మళ్ళీ పాడైంది. అసలు ఏమవుతోందో అర్థం కావట్లేదు సార్!" అని దుఖంతో అన్నాడు పి.ఏ.

"నాకు అర్థమైంది" అని ఓ నిముషం పాటు ఆలోచించిన తర్వాత "ఇక ఆలస్యం చెయ్యకుండా మా ఇంటికి వెళ్దాం పదా!" అన్నాడు హేమంత్.

వెళ్ళిన వెంటనే అందరిని పిలిచి...

"ఇన్నాళ్ళూ ఈ ధన నష్టానికి గల కారణం ఇప్పుడు నాకు అర్థమైపోయింది. త్వరగా నా గదిలో ఉన్న బుక్షెల్ఫ్ ని ఈశాన్యం నుండి తీసువేయండి!!!" అని హడావిడిగా అన్నాడు హేమంత్.

"హమ్మయ్యా!" అని అందరూ అనుకుని అతని గది తలుపు తెరిచి చూడంగానే ఆశ్చర్యపోయారు. అక్కడ బుక్షెల్ఫ్ ఈశాన్యంలో లేదు.

"ఏమైంది..ఈశాన్యంలో బరువు లేదుకదూ! మీకొక ఝలక్ ఇవ్వనా?! నేను ఏ రోజైతే బుక్షెల్ఫ్ ని అక్కడ పెట్టానో, అదేరోజు దానిని అక్కడ నుండి తీసివేశాను. ఎందుకోతెలుసా? మిమ్మల్ని పరీక్షించడానికి! శ్రావ్యా.. నువ్వు అన్నట్టు అన్నీ యాదృచ్ఛికం కావు.. కొన్ని మాత్రమే! నేను ఆ రోజు పంతులుతో కావాలనే అలా వ్యతిరేకంగా మాట్లాడాను... నేను మాట్లాడిన మాటలను చూసి మీరందరూ నా సహనానికి పరీక్ష పెట్టారు! ముందు పి.ఏ. పర్సనల్ అసిస్టెంట్. పర్సనల్ అంటే నమ్మకం ఉండాలి. కానీ అతను నాకు నమ్మకద్రోహం చేశాడు. రెండు కాంపొనెంట్లకి నాలుగని చెప్పి.. రిపోర్ట్స్ రానీయకుండా అదిమిపెట్టి.. జేబులో డబ్బుని జమాచేసుకున్నాడు. కావాలని తప్పులు చేసి.. కమీషన్ కూడా కొట్టేసాడు. కార్ పాడైందని.. సిస్టమ్ క్రాష్ అయ్యిందని.. నాతో

కో-ఆపరేట్ చేస్తున్నట్టు నటించి ఇంక్రిమెంట్‌పై కన్ను కూడా వేశాడు" అని పి ఏ వంక కోపంగా చూశాడు హేమంత్.

పి.ఏ సిగ్గుతో తలవంచుకున్నాడు.

"నేను తలచుకుంటే ఇప్పటికిప్పుడు నిన్ను ఉద్యోగం నుంచి తీసివేయవచ్చు! కాని నేను అలా చెయ్యను! ఎందుకంటే నీకు ఇప్పుడు నేనేంటో తెలిసింది కదా.. నాతో ఎలా వ్యవహరించుకోవాలో అర్థమయ్యే వుంటుంది!" అన్నాడు హేమంత్.

"రెండోది గోపాల్..తండ్రి జేబుని కొట్టేయడానికి ఇంతకంటే మంచి అవకాశమేముంటుంది ? ఎప్పుడు ఫీజ్ కట్టినా రిసిప్ట్ తీసుకువచ్చి ఈ సారి మొహం చాటేస్తే కనిపెట్టలేననుకున్నావా ?!" అని నిలదీసాడు హేమంత్.

"పైగా.. అదేమిటని అడిగితే అదేదో నా తప్పు అయినట్టు మాట్లాడడం ఒకటి...! నా భార్య కూడా ఈ విషయంలో ఆలోచించాలి. మన బలహీనతకి కొన్ని సంఘటనలు బలం చేకూరిస్తే మనం మానసికంగా బలహీనపడకూడదు!" అని నిష్కపటంగా అన్నాడు హేమంత్.

సిగ్గుతో వాళ్ళు తల వంచుకుని, హేమంత్‌ని క్షమాపన వేడుకున్నారు.

ఈశాన్యంలో బరువుపెడితే ధనహాని జరుగుతుందో లేదో కాని... మంచి గుణపాఠాన్ని మాత్రం నేర్పింది.

***




"జాంకాయలు, చింతకాయలు అమ్మి, మీనాన్న మిమ్మల్ని చదువుకోవడానికి అమెరికా పంపిస్తాడు. మీరక్కడ బాగా చదువుకొని, కోట్లు సంపాదించి, ఇంటికొచ్చేసరికి, మీ నాన్న పాడె మీద వుంటారు!. ఇదీ ఇప్పుడు తీయబోయే సీన్ మేడం" వినయంగా వంగి చెప్పాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"అది నాకనవసరం! నేనేం చెయ్యాలో చెప్పండి, అదిచాలు"! పెదాలమీది లిప్టిక్‌ని నాలుక కొనతో సవరించుకుంటూ అంది హీరోయిన్.

"చనిపోయింది మీ కన్నతండ్రి కదా మేడం? కాబట్టి మీరు భాదతో ఏడ్వాలి" అన్నాడతను.

"అవునా? నాకు ఎక్స్‌పీరియన్స్ లేదుగా? ఎలా మరి?" క్యాజువల్‌గా అందామె.

అసిస్టెంట్ డైరెక్టర్‌కి తల గిర్రున తిరిగినట్టైంది.

"ఇందులో ఎక్స్‌పీరియన్స్ ఎందుకు మేడం, మనదగ్గరవాళ్లు చనిపోతే, ఏడ్వటం మామూలే కదా" అన్నాడతను.

"నిజమే అనుకో, మానాన్న ఇంకా చావలేదుగా, శుభ్రంగా ఇంకా బ్రతికే వున్నాడు.! అందుకే ఎలా ఏడ్వాలో తెలీదని చెబుతున్నాను. ఏదో డ్యూయెట్లూ, రొమాంటిక్ సీన్‌లైతే చాలా ఈజీగా చేసేదాన్ని, పోనీ ఎలా చెయ్యాలో చెప్పు" అంది కథానాయికి.

"మీ బంధువులు ఎవరైనా చనిపోయినపుడు వెళ్ళడం, అక్కడ వాళ్ళింట్లోవాళ్ళు ఏడ్వడం ఎప్పుడూ చూడలేదా మేడం" అడిగాడతను.

నిమిషంసేపు లిప్టిక్ పెదాల్ని కొరుక్కుని, "ఆ గుర్తొచ్చింది! మా పక్కింటి పిన్నిగారి వాళ్ళాయన పోతే, అప్పుడు చూశాను!" చెప్పిందామె.

అసిస్టెంట్ డైరెక్టర్ ముఖం వెయ్యి క్యాండిళ్ళ బల్బ్‌లా వెలిగింది.

"ఆ ఎక్స్‌పీరియన్స్ చాలు మేడం. ఏదీ ఒక్కసారి మీ పిన్నిగారు ఎలా ఏడ్చారో గుర్తుచేసుకుని, చూపించండి మేడం." అడిగాడతను.

ఐదుక్షణాలు గట్టిగా ఊపిరిపీల్చుకుని, ఒక్కసారిగా, కెవ్వుమని కేకపెట్టి, "ఓర్నాయనో నాకు అన్యాయంచేసి, వెళ్లిపోయాడ్రో దేవుడో.. నా ఐదోతనాన్ని బలవంతంగా లాక్కెళ్ళిపోయాడ్రో భగవంతుడో.." అంటూ అరిచేసరికి, యూనిట్ మొత్తం కకావికలైపోయి, ఏం జరిగిందో అర్థంకాక డైరెక్టర్, నిర్మాత హీరోయిన్ దగ్గరకు పరిగెత్తారు.

అందరూ అక్కడికి వెళ్ళేసరికి, హీరోయిన్ ఎలా చేసానో చెప్పండంటూ చిద్విలాసంగా వుంది.

"అలాకాదు మేడం, మీరు హైలీ ఎజ్యుకేటెడ్ కదా..? అలా ఏడ్వకూడదు! మీ శోకం అఫిషియల్‌గా వుండాలి." చెప్పాడు డైరెక్టర్.

"అంటే ఎలా చేయాలో చెప్పండి సార్." అమాయకంగా అడిగింది హీరోయిన్.

"గంపెడుభారాన్ని గుండెల్లో దాచుకుని, మీలో మీరే, కుమిలిపోవాలి, శోకాన్ని పెదాల్లో అదిమిపెట్టి, కన్నీళ్లు కార్చాలి". చెప్పాడు డైరెక్టర్.

ఇంతలో, నిర్మాత డైరెక్టర్ దగ్గరికొచ్చి, చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు. వినిన వెంటనే, సంతోషంతో ఇద్దరూ షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు.

"ఈ సీన్‌తో మన సినిమా ఇంకో ఫిఫ్టీడేస్ గ్యారెంటీ గురూ" ఆనందంగా అన్నాడు నిర్మాత.

క్రింద తెల్లటి పరుపువేసి, దానిమీద తండ్రి వేషం వేస్తున్న నటుడ్ని పడుకోబెట్టారు. అతడిమీద, పూలమాలలతో నింపేసారు. అతనిచుట్టూ, పాతికమంది ముసలిముతకా జూనియర్ ఆర్టిస్ట్‌ల్ని కూర్చోబెట్టారు.

నిర్మాత, తనూ మాట్లాడుకున్న రహస్యాన్నే డైరెక్టర్ మేకప్‌మెన్ చెవిలో చెప్పాడు. మేకప్‌మెన్‌కి సీన్ అర్థమైంది.

హీరోయిన్ పెదాలకు దొండపండురంగులో లిప్టిక్ పూసి, ఆమె కళ్ళలో గ్లిజరిన్ చుక్కలు వేసాడు. హీరోయిన్‌తో నిమిత్తం లేకుండా, కన్నీళ్లు కారడం మొదలెట్టాయి.

"మేకప్ కరిగిపోదుగా"..! అమాయకంగా అడిగింది హీరోయిన్.

"లేదు మేడం ఇట్స్ ఇంపోర్టెడ్" బదులిచ్చాడతను.

డైరెక్టర్ ఆమె దగ్గరికి వెళ్ళి, పైటను రెండుగుండెలమధ్య సన్నటిపాయలా సర్దాడు. సెన్సార్‌వారికి భయపడి, లోపలే దాక్కోలేక, కత్తిరిస్తారేమోనని, ఆందోళనగా తొంగిచూస్తున్న లేత అందాల్ని, తొంగిచూస్తూ నిర్మాత తృప్తిగా తలపంకించి, డైరెక్టర్ వైపు చూసాడు.

కెమెరామెన్ చూసిరమ్మంటే, ఫిల్మ్ ని కాల్చివచ్చే రకం. వెండితెరమొత్తం హీరోయిన్ గుండెలు, పెదాలు తప్ప మరేమీ కనిపించకుండా కెమెరా యాంగిల్ ఎక్కుపెట్టాడు.

హీరోయిన్ తన ఎర్రటి పెదాల్ని మునిపంటితో కసిగా కుర్రకారు కైపెక్కేలా కొరికి, కన్నీళ్లు తన రవికను తడిపి ముద్దచేసేలా రోదించింది.

డైరెక్టర్ అమితానందంతో మరో షాట్ చెప్పాడు.

హీరోయిన్ ఏకసంధ్యాగ్రాహిలా, దుఃఖంతో కుమిలిపోతుందో, విరహంలో కమిలిపోతుందో తెలియనంత లెవల్లో నటించింది. పదినిమిషాల లాంగ్‌షాట్ ఒకేషాట్లో ఓకే చేసేసరికి.. సెట్‌మొత్తం చప్పట్లతో మార్మోగింది.

తర్వాతి షాట్‌కోసం మిగతావాళ్ళు రెడీఅవుతుంటే, హీరోయిన్ తన చైర్‌లో రిలాక్స్ డ్ గా కూర్చునివుండగా ఆమెచేతిలోని మొబైల్ మ్రోగింది.

అవతల ఇంటినుంచి పనిమనిషి తాయారు ఏడుస్తూ, "అమ్మగారూ.. పెద్దయ్య గుండెనొప్పితో చనిపోయారమ్మా..అంటోంది రోదిస్తూ.

"సర్లే వస్తున్నా.. ఫోన్‌పెట్టెయ్యి" విసుగ్గా అని, మొబైల్ ప్రక్కన పడేసింది హీరోయిన్.

"ఏమైంది మేడం? అలా వున్నారు?" అడిగాడు డైరెక్టర్.

"ఆ ఏంలేదులేసార్! హార్ట్ అటాక్‌తో మా డాడీ చనిపోయాడంట, ఇంటిదగ్గరనుంచి ఫోనొచ్చింది" చాక్లెట్ కవర్ వూడదీసినంత తేలిగ్గా చెప్పిందామె.

డైరెక్టర్ అదిరిపడి, "అదేంటి మేడం? మీతండ్రిగారు పోతే, ఇంత తేలిగ్గా మాట్లాడుతున్నారు???!" ఆశ్చర్యంగా అన్నాడతను.

"నాకు నావాళ్లకంటే నా ప్రొఫెషన్ దేవుడితో సమానం, అదేనాకు ముఖ్యం సార్.." బదులిచ్చింది హీరోయిన్.

"నీ అంకితభావానికి ఆస్కార్ ఇవ్వొచ్చు" అని మనసులో అనుకున్న డైరెక్టర్, అలాకాదు మేడం, ఎవరో ఐతే పర్వాలేదు., మీ ఓన్ ఫాదర్ కదా.? అందుకని దయచేసి, వెంటనే వెళ్ళండి" చెప్పాడతను.

"అంతేనంటారా? సరేఐతే, మనసినిమాకు ఎలాంటి నష్టం వుండదనే నమ్మకంతో వెళ్తున్నాను." వదల్లేక ,వెళ్తున్నట్టు వెళ్ళిందామె.

"మనతర్వాతి సినిమాకు ఈమెనే బుక్‌చేద్దాం డైరెక్టరూ," తడికళ్ళతో అన్నాడు నిర్మాత.

హీరోయిన్ తన ఇంటికి వెళ్ళేసరికి, ఓ చేపమీద ఆమె తండ్రిని పడుకోబెట్టి వున్నారు. చుట్టూ కొద్దిమంది బంధువులు.

హీరోయిన్ని చూడగానే, పనిమనిషి తాయారు "అమ్మగారూ .." అంటూ గట్టిగా రోదించడం మొదలెట్టింది.

రెండుక్షణాలు తండ్రిశవాన్ని చూసి, మెట్లెక్కి, నేరుగా తన బెడ్‌రూంలోకి వెళ్ళిపోయి తలుపేసుకుందామె.

మేకప్ తుడుచుకుంటూంటే ఆలోచనలు ఆమె గతం, బాల్యం ఫిలింరీల్స్‌లా గిర్రున వెనక్కు తిరిగాయి.

చిన్నతనంలోనే తల్లి చనిపోతే, తన రెక్కలుముక్కలు చేసుకుని, తనతండ్రి ఎలా తనను పెంచిపెద్దచేసాడో, తన సినిమా అవకాశాల కోసం ఎందరి కాళ్ళు పట్టుకుని, ఇంకెందరి చీత్కారాలు అనుభవించాడో అంతా గుర్తుకొచ్చిందామెకి. ఇప్పుడు తను అనుభవిస్తున్న స్టార్‌డం, స్టేజ్ సర్వం తనతండ్రి పెట్టినబిక్షే అని తెలిసొచ్చిందామెకి.

"కనీసం ఆయన కోసం కాసేపైనా బాధపడాలి, కొన్ని కన్నీళ్లైనా కార్చాలి" అనుకుందామె.

వెంటనే డైరెక్టర్‌కి కాల్‌చేసి, "సార్ మన మేకప్‌మ్యాన్ని తీసుకుని, వెంటనే రాగలరా?" అంది.

అర్ధగంటలో వాళ్ళిద్దరు అక్కడికి చేరుకున్నారు.

"మా ఫాదర్ నాకోసం తన జీవితమంతా ఎంతో కష్టపడ్డాడు., ఆయన కోసం కాసేపైనా బాధపడకపోతే, బాగుండదు. కాబట్టి నేనిప్పుడు ఏడవాలి, ఆయనకోసం కొన్ని కన్నీళ్ళైనా కార్చాలి, అందుకు మీరు హెల్ప్ చెయ్యాలి"! చెప్పింది హీరోయిన్.

విత్‌ప్లెజర్ మేడం అన్నాడు డైరెక్టర్.

హీరోయిన్ ముఖంలో మేకప్ మారిపోయింది. ఏడ్చి, ఏడ్చి, ఉబ్బినట్టుండే కళ్ళు, శోకంతో పాలిపోయిన ముఖం, కంటిక్రింద నల్లటి చారలు..

గుడ్, ఇప్పుడు మీరు నిరభ్యంతరంగా ఏడ్వచ్చు మేడం అన్నాడు డైరెక్టర్.

హీరోయిన్ తన తండ్రిశవం దగ్గరకు వెళ్ళి కూర్చుంది.

అయిదు, పదినిమిషాలు, అర్థగంట గడిచింది. ఆశ్చర్యం! హీరోయిన్ దుఃఖాన్ని అభినయించలేకపోతొంది, గ్లిజరిన్ వేసినా ఆమె కంట్లోంచి కన్నీళ్ళు కారడం లేదు!! శోకించడానికి శతవిధాలా ప్రయత్నించినా ఆమెవల్ల కావడం లేదు.!!

ఆమె నిస్సహాయంగా డైరెక్టర్‌వైపు చూసింది. అతని బుర్రలో తళుక్కుమని, ఓ ఐడియా మెరిసింది.

ఇంట్లో వున్న లైట్లన్నీ ఆన్ చేయించాడు, హీరోయిన్ దగ్గరకు వెళ్ళి, ఎవరికీ వినపడకుండా, ఆమె చెవిలో నెమ్మదిగా " సైలెన్స్, లైట్సాన్, కెమెరా.. యాక్షన్.." అన్నాడు.!!

అంతే, అంతవరకూ కరువుతో అల్లాడిన ఆమె బుగ్గల్ని, వరదగోదారి ముంచెత్తింది. ఆమె భుజాలు వాటంతట అవే కదలడం మొదలెట్టాయి.,కడుపులో తన్నుకొచ్చిన శోకాన్ని, ఆమె పెదాల ఆనకట్టలు ఆపలేకపోయాయి.

ఆమె గంటసేపు తనివితీరా ఏడ్చి, సంతృప్తిగా డైరెక్టర్‌వైపు చూసింది. షాట్ ఓకే అన్నట్టు బొటనవేలు పైకెత్తి కళ్లతో అభినందించాడు డైరెక్టర్.

***




చేతిలో కాగితాన్ని కోపంగా నలుపుకుంటూ పళ్ళు పట పటా కొరుకుతూ మెట్లు దిగుతున్న శశిని చూసి నాకేమనాలో అర్ధం కాలేదు. కంగారు పడుతూ నేను శశాంక్ కేబిన్ లోకి వెళ్ళి ఏమయిందని  అడిగాను.

"ఏం లేదు మధూ, నేనే కావాలనే పరీక్ష కాస్త కష్టంగా పెట్టాను. ఇప్పటి పిల్లలకు చదువు ఉంది. కానీ సంస్కారం లేదు. పెద్దలంటే గౌరవం లేదు, మనుష్యులంటే ఆదరాభిమానాలు లేవు. అలాంటి చదువులకు విలువ లేదని నా అభిప్రాయం. నువ్వు చెప్పినవన్నీ విన్న తరువాత నా అనుభవం చెప్తున్నదేమిటంటే ఆ అమ్మాయి మనస్సు చాలా మంచిది. కానీ ఆ మంచితనాన్ని మూసేస్తున్న అహం, స్వార్ధం అనే మబ్బులను మనం తొలగించగలిగితే సమాజానికి మనమొక ఆణిముత్యాన్ని ఇచ్చిన వాళ్ళమవుతాం. చూద్దాం. అయినా నువ్వేం కంగారు పడకు. మరల శశి ఇక్కడకు వస్తుంది' అంటూ ఆయన కారెక్కి వెళ్ళిపోయాడు.

శశి కోపానికి గల కారణం చెప్పాలంటే ముందు మీకు తన గురించి, తన కుటుంబం గురించి చెప్పాలి...

మా నాన్నగారి మొదటి భార్యకి పుట్టిన సంతానం మా అక్క పార్వతి. పార్వతి వాళ్ళ అమ్మ చనిపోతే మా నాన్న మా అమ్మని పెళ్ళి చేసుకున్నారు. అంతకు ముందు నాకు తెలియదు. కాని నేను పుట్టినప్పటినుండి నవ్వు అంటే ఎరుగని అమ్మాయి పార్వతి. నా కంటే పదేళ్ళు పెద్దది. మా అమ్మ అక్కని ఓ పనమ్మాయి కంటే హీనంగా చూస్తూ కనీసం కడుపు నిండా అన్నం కూడా పెట్టేది కాదు. ఇవన్నీ చూస్తున్నా ఏమయినా అంటే అమ్మ అక్కని ఇంట్లో నుండి తరిమేస్తుందన్న భయంతో నాన్న ఏమీ అనలేక తనలో తానే బాధపడుతూ ఉండేవాడు. నేను, మా అక్క మాత్రం చాలా ప్రేమగా ఉండేవాళ్ళం. ఎవడో తాగుబోతు ఎదురు కట్నం ఇస్తానన్నాడని మా అక్కని బలవంతంగా వాడికిచ్చి పెళ్ళి చేసింది మా అమ్మ. మా బావ పెళ్ళయిన తరువాత చేసిన మొట్టమొదటి పని ఏమిటంటే మాకూ అక్కకి గొడవలు పెట్టి అక్కని మాకు కాకుండా చేయడం. ఈ గొడవలతో నాన్న ఏమీ అనలేక మనోవ్యధతో కాలం చేసారు. కొన్నాళ్ళకే అమ్మ కూడా పోయింది. నన్ను మా మావయ్య తీసుకుని వెళ్ళాడు. పెళ్లి తర్వాత అక్క పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టయింది. బావకి చీకటి పడితే తప్పితే ఇల్లు గుర్తుకు రాదు. ఈ లోగా ఇద్దరు కూతుళ్ళు పుట్టారు. ఇద్దరూ ఆడపిల్లలు పుట్టారని, మా బావ అక్కనీ, పిల్లల్నీ నడిరోడ్డు మీద వదిలేసి వెళ్ళిపోయాడు. ఎప్పటికప్పుడు అక్క పరిస్థితి తెలుస్తున్నా, అభిమానవంతురాలైన మా అక్కకి ఎటువంటి సహాయం చేయలేక చూస్తూ బాధపడడం నా వంతయింది.

అక్క పెద్దకూతురు రమ. పొందికైన పిల్ల. చిన్నది శశి. నాన్న బుద్ధులన్నీ పుణికిపుచ్చుకుంది. తాను చాలా అందగత్తెనని, తెలివైనదానినని అహంకారం. వాళ్ళమ్మకి ఒక కన్ను లేదని, అక్క అందంగా ఉండదని వీళ్ళంటే చాలా చిన్న చూపు శశికి. ఎంతో తప్పని పరిస్థితులయితే తప్పితే వాళ్ళిద్దరితో బయటకు కూడా వెళ్ళడానికి ఇష్టపడేది కాదు.

మా అక్క ఉదయాన్నే లేచి ఇళ్ళల్లో పాచి పని చేసి, ఇంటి పని చూసుకుని, దగ్గర్లో కడుతున్న అపార్టుమెంటుల లోకి సిమెంట్ పనులకి వెళ్ళి, మరల సాయంత్రం మరో రెండు ఇళ్ళల్లో పనులు చేసి కుటుంబాన్ని పోషించేది. ఇంటి పరిస్థితిని అర్థం చేసుకున్న రమ అమ్మకి చేదోడువాదోడుగా ఉండటానికి టైలరింగ్ నేర్చుకుని బట్టలు కుడుతుంది. చదువుకుంటానన్న శశిని వాళ్ళిద్దరూ కలిసి చదివిస్తున్నారు. శశి వాళ్ళ సంపాదనతో చదువుకుంటూ వాళ్ళనే కించపరుస్తూ మాట్లాడేది. ఇప్పుడు శశి ఉద్యోగాల వేటలో ఉంది. మా బాస్ తమ్ముడు గారైన శశాంక్ గారి ఆఫీస్ లోనే ఇప్పుడు శశికి ఇంటర్వ్యూ.

శశాంక్ గారు చాలా పెద్ద మానసిక శాస్త్రవేత్త. పెద్ద పెద్ద కంపెనీలకి మ్యాన్ పవర్ కన్సల్టెంట్. అంతర్జాతీయ స్థాయిలో సమాజ సేవకుడని మంచి పేరున్న వ్యక్తి. ఆయనతో నాకున్న చనువుతో శశి గురించి, మా అక్క గురించి జరిగినదంతా చెప్పాను. ఆయన ఎలా అయినా మా అక్క ముఖంలో ఆనందం నాకు చూపిస్తానని, శశిని మారుస్తానని మాట ఇచ్చారు.

ఆ ప్రహసనం లో భాగమే ఇదంతా...

'మే ఐ కమ్ ఇన్ సార్...' వినయంగా అడిగింది శశి.

'రామ్మా. కూర్చో.' అన్నారు శశాంక్.

'మీ గురించి, మీ ఫ్యామిలీ గురించి కాస్తా చెప్పమ్మా, అంటే మీ నాన్నగారు ఏం చేస్తూ ఉంటారు? మీరెంతమంది, నువ్వెక్కడ చదువుకున్నావు, నీ హాబీస్ ఏమిటి, వగైరా, వగైరా...'

'సార్. నా చిన్నప్పుడే నాన్నగారు మమ్మల్ని వదిలి వెళ్ళిపోయారు. నేను అమ్మ, అక్క. నేను మునిసిపల్ స్కూల్ లో చదువుకున్నాను. మంచి మార్కులు రావడంతో ఇంటర్, ఇంజనీరింగ్ గవర్నమెంటు కాలేజీలలో సీటు వచ్చింది. నా చదువుకైన ఖర్చంతా మా అమ్మ, మా అక్క భరించారు' అని చెప్పింది.

'ఓ. గుడ్. మీ అమ్మ, అక్క ఏం చేస్తుంటారు?'

ఇక తప్పదన్నట్లు చెప్పింది. 'సార్. మా అమ్మ నాలుగయిదు ఇళ్ళల్లో పనిచేస్తుంది. అపార్టుమెంటుల కట్టడాల పనులకి వెళ్తుంది. మా అక్క బట్టలు కుడుతుంది'

'అమ్మా. నాకు మీ అమ్మగారిని చూడాలని ఉంది. తీసుకొస్తావా' అని అడిగారు.

'తను ఎక్కడికీ రాదు సార్. నా బయోడేటా మీకు నచ్చితే చెప్పండి. లేకుంటే లేదు' అని కొంచెం కర్కసంగానే ఉంది.

'ఓ. ఐ యామ్ సారీ. సరే కానీ నువ్వు ఎప్పుడైనా మీ అమ్మగారి అరచేతులని చూసావా' అని అడిగిన ప్రశ్నకు అయోమయంగా చూస్తూ లేదన్నట్లు అడ్డంగా తల ఊపింది.

'ఈ రోజు సాయంత్రం ఒకసారి చూడమ్మా. చూసి రేపు మరల నువ్వు రా. అప్పుడు చెప్తా నీ బయోడేటా నాకు నచ్చిందో లేదో' అని చెప్పారు.

ఏదయితేనేం తనకిప్పుడు జాబ్ ముఖ్యం. ఎలాగోలా ఈ జాబ్ సంపాదించుకుంటే ఇక లైఫ్ అంతా తిరిగి చూసుకోవలసిన పని ఉండదు. ఈ ఆలోచనలతో ఇల్లు చేరిన శశి కి ఆయాసపడుతూ తనతో పాటే వస్తున్న అమ్మ ఉనికి తెలియనేలేదు.

అమ్మ అరచేతుల్ని చూడాలని చాలా ప్రయత్నించింది కానీ కుదరలేదు. ఎలాగైనా చూడాలని నిర్ణయించుకుని రాత్రి భోజనాలయ్యాక తప్పదన్నట్లుగా అమ్మ పక్కన కూర్చుని 'అమ్మా… నీ చేతులు ఒకసారి ఇలా ఇయ్యి' అని అడిగింది.

ఏమీ అర్ధం కాని పార్వతి అరచేతులు ముందుకు చాచింది.

ముందెన్నడూ చూడని ఆ అరచేతులు చూసిన శశి ఒక్క క్షణం నివ్వెరపోయింది. అంట్లు తోమడం వలన గోళ్ళన్నీ మట్టి పట్టి నల్లగా ఉన్నాయి. సర్ఫ్, సబ్బు, నీలిమందు నీళ్ళల్లో నానిన ఆ చేతులు అక్కడక్కడా పొక్కిపోయి, చిన్న చిన్న కన్నాలు పడి గరుగ్గా ఉన్న ఆ చేతుల్ని చూసి మనస్సు కలచివేసినట్లయింది శశి కి.

'ఏమయిందే కొత్తగా అలా చేస్తున్నావు ఈవేళ?' అన్న అమ్మ పిలుపుతో ఈ లోకం లోకి వచ్చింది.

'ఏం లేదులే అమ్మా. నువ్వు పడుకో' అంది శశి.

కళ్ళు మూసినా ఆ చేతులే కళ్ళల్లో మెదుల్తూ ఉన్నాయి. నాన్నలానే అమ్మ కూడా వదిలేసి వెళ్ళిపోయి ఉంటే నా భవిష్యత్తు ఏమై ఉండేది? ఈ ఆలోచనలతో తల పగిలిపోతుంది. రేపు ఈ అరచేతుల గురించి ఏమని అడుగుతారో, నా సమాధానం లో ఆయన ఏమి తెలుసుకోవాలనుకుంటున్నారో, ఈ చేతి రాతల ఇంటర్వ్యూ ఏమిటో అంతా అయోమయంగా ఉంది. ఏదయితేనేం చూసిందే చెప్పదలచుకుంది.

మరుసటి రోజు శశాంక్ ఆఫీసు కి వెళ్ళి మౌనంగా కూర్చుంది శశి.

'ఏమ్మా అలా ఉన్నావు?

'సా...ర్... నిన్న... నేను మా అమ్మ చేతులు చూసాను, అక్కడక్కడా పొక్కిపోయి ఉన్నాయి. మా గురించే... తను అంతలా... కష్టపడుతుంది'. అంతకంటే ఏమీ చెప్పలేనట్లుగా నీళ్ళు నిండిన కళ్ళతో శశాంక్ వంక చూసింది.

''అరరె. సారీ అమ్మా. నిన్ను బాధపెట్టినట్లున్నాను. ఇదుగో ఈ మంచినీళ్ళు తాగు'.

'నాకు ఇంకొక్క చిన్న పని చేసిపెట్టు. రేపు వచ్చినప్పుడు మీ ఫ్యామిలీ ఫోటో మర్చిపోకుండా తీసుకునిరా' అంటూ వేరే పనిలో నిమగ్నమయిపోయారు శశాంక్ గారు.

శశి వెళ్ళిపోయిన తర్వాత శశాంక్ ఆలోచనలో పడ్డారు. నేటి పిల్లలకి విశ్వాసం, ప్రేమ, అభిమానం లాంటి పదాలు, వాటి అర్ధాలు, జీవితం లో వాటి విలువ తెలియట్లేదు. ఇప్పుడిప్పుడే ఈ అమ్మాయి జీవితం లోకి అడుగు పెడుతోంది కాబట్టి వీటి పరమార్ధం తను గ్రహించేటట్లు చేస్తే ఇంత మంచి తెలివితేటలున్న అమ్మాయికి ఒక మంచి వ్యక్తిత్వం కూడా ఇచ్చిన వాళ్ళమవుతాం.

శశి ఫోటో అయిష్టంగానే శశాంక్ చేతిలో పెట్టింది. శశాంక్ ఆ ఫోటో చూసి ఆశ్చర్యపోయాడు. అందులో ముగ్గురూ ఉన్నారు. శశి అమ్మకి ఒక కన్ను లేదు. అదే అడిగారు శశిని శశాంక్.

'అదేమిటీ మీ మదర్ కన్నేమయింది' అనుకున్నట్లుగానే ఆత్రంగా అడిగారు శశాంక్.

'ఏమో సార్. చిన్నప్పుడు ఆడుకుంటున్నప్పుడు ముల్లు గుచ్చుకుని పోయిందట'. అను ముక్తసరిగా సమాధానం చెప్పింది.

'ఈ ఫోటో చూస్తుంటే ముల్లు గుచ్చుకుని కన్ను పోయినట్లు లేదే. అస్సలు కన్నే లేదు. ఖచ్చితంగా ఏదో జరిగింది. అది నీకు తెలియదు అంతే'. అన్నారు శశాంక్.

'అయి ఉండొచ్చు సార్. నేను పెద్దగా ఎప్పుడూ పట్టించుకోలేదు మరి' అని ముక్కుబడిగా సమాధానం చెప్పింది.

'చూడు శశి. నీకు చదువు ముఖ్యమే. బట్ ఎట్ ద సేమ్ టైమ్ కుటుంబం విషయంలో నీకు కూడా ఒక బాధ్యత ఉంటుంది కదా. కుటుంబం అంటే నాలుగు గోడల మధ్య నలుగురు మనుష్యులు ఉండటం మాత్రమే కాదు కదా. నువ్వు ఇప్పుడు చేరబోయే జాబ్ లో నువ్వు నిరంతరం మనుష్యులతో, వారి మనస్తత్వాలతో డీల్ చేయాలని తెలుసు కదా. మీ ఇంట్లో వాళ్ళ గురించే నీకు పూర్తిగా తెలియకపోతే ఇక బయటవాళ్ళ గురించి ఎలా తెలుసుకుంటావు' అని ఇంకా ఏదో అనబోయేంతలో. ఇక ఓపిక నశించిన శశి 'సార్. నాకు నా చదువు, మార్కుల ఆధారంగా మీ ఉద్యోగానికి నేను తగినదానను అనుకుంటే చెప్పండి లేదా నేను వేరే జాబ్ ట్రై చేసుకుంటాను' అని లేవబోయింది.

'అది ఓ కే మేడమ్. కానీ మా ఆలోచన ఒకటే. మాతో కలిసి పనిచేసే వ్యక్తికి కంపెనీ పట్ల విశ్వాసం ఉండాలి. మనుష్యులని వస్తువులుగా కాక మనసున్న మనుష్యులుగా చూడాలి. మాకు లాభాల కంటే విలువలు ముఖ్యం. మానవతా విలువలు, వాటికనుగుణంగా ఉండగలిగిన వారు మాత్రమే ఈ ఉద్యోగానికి అర్హులు'. అంటూ కాస్త మందలిస్తున్నట్లుగా చెప్పారు శశాంక్.

చెప్పడం పూర్తయిందా అన్నట్లు విసుగ్గా లేచి వెళ్ళింది శశి.

ఉదయం 10 గంటలకి అమ్మ పనికి వెళ్ళింది. శశి నెమ్మదిగా అక్క వద్దకు వెళ్ళి, 'అక్కా నా మీద ఒట్టేసి నిజం చెప్పు. అమ్మ కన్ను ముల్లు గుచ్చుకుని పోయిందని నువ్వు నాతో ఎందుకు అబద్ధం చెప్పావు? అని అడిగింది.

'మరి నాకు అంతే తెలుసు'

'అక్కా ప్లీజ్. నువ్వు నా వద్ద ఎందుకు దాస్తున్నావో తెలియదు. నాకు నిజం తెలియాలి. అదీ ఇప్పుడే. చెప్పకపోతే నా మీద ఒట్టే'.

'శశి. నేను అమ్మకి మాటిచ్చాను. ఎప్పటికీ నీకు చెప్పనని. అయినా నువ్వు ఇంతలా అడుగుతున్నావు కనుక విను'.

నీకు తెలిసీ తెలియని వయస్సులో ఒకరోజు రాత్రి అమ్మ పని నుండి బాగా జ్వరంతో వచ్చింది మంచం మీద స్పృహ లేకుండా వాలిపోయింది. నేను నీళ్ళు తోడడానికి వాకిట్లోకి వెళ్ళి వచ్చే లోపల నువ్వు పాకుకుంటూ పొయ్యి దగ్గరకు వెళ్ళావు. మండుతున్న కట్టె ఒకటి పేలి వాటి రవ్వలు నీ కంట్లో పడ్డాయి. నువ్వు విపరీతంగా ఏడుస్తూండేసరికి మేము నిన్ను హాస్పిటల్ కి తీసుకెళ్ళాము. పరీక్షలన్నీ చేసిన డాక్టర్లు తేల్చి చెప్పినదేమిటంటే కంట్లో రెటీనా బాగా దెబ్బ తినడం వలన నీ కంటికిక చూపురాదని. కానీ ఎవరైనా కన్ను ఇవ్వడానికి ముందుకొస్తే, మన కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఆపరేషన్ ఉచితంగా చేస్తామని చెప్పారు. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అమ్మ వెంటనే తన కన్ను ఇస్తానని చెప్పింది. డాక్టర్లు ఎంత చెప్పినా వినకుండా తన కన్ను నీకు ఇచ్చింది'.

ఇదంతా విన్న శశి వెక్కి వెక్కి ఏడుస్తూ... 'ఎందుకక్కా నాకిన్నాళ్ళూ ఈ విషయం చెప్పలేదు. నిజం తెలియకుండా నేను ఊహ తెలిసిన దగ్గర్నుండీ అమ్మని చాలా కష్టపెట్టాను. అమ్మకి ఒక కన్ను లేదని, తనని అలా నా ఫ్రెండ్స్, టీచర్స్ చూస్తే నాకు చిన్నతనమని ఎపుడూ ఎవరికీ అమ్మని పరిచయం చేయలేదు. నా పక్కన తను నడిస్తేనే నేను అవమానంగా ఫీల్ అయ్యేదాన్ని. ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా అమ్మని నేను అవమాన పరిచాను. టీచర్స్ ఎవరైనా అమ్మ గురించి అడిగితే, మా అమ్మ లేదని, ఊరెళ్ళిందని చెప్పేదాన్ని. తనని నా తల్లి అని చెప్పుకోవడానికి నామోషి అనిపించే నేను తనకి దూరంగా హాస్టలు లో ఉంటానన్నది అని కూడా' అంది.

ఇంతలో పార్వతి ఇంట్లో అడుగుపెడుతూనే శశి ఏడుపు చూసి కంగారుపడుతూ ఏమయిందని అడిగింది.

'అమ్మా. ఎంతో త్యాగం చేసి నాకు కొత్త జీవితాన్ని ఇచ్చావు. దానికి ప్రతిఫలంగా నేను నీకు దుఃఖాన్ని, క్షోభని ఇచ్చాను. నేను నీ పట్ల చేసింది మామూలు తప్పు కాదమ్మా...'

'అదేమిటే. నీ కళ్ళల్లో ఈ కన్నీళ్లు చూడకూడదనే కదా నేను ఇన్నేళ్ళు ఇంత కష్టపడ్డది. మీరిద్దరు బాగుంటే అంతకంటే నాక్కావలసినదేముందమ్మా'

రాత్రి అమ్మ పక్కనే పడుకుని అమ్మ రెండు చేతుల్నీ తన బుగ్గలకి ఆనించుకుని చంటి పిల్లలా ఏదో తెలియని కొత్త అనుభూతిని మనస్ఫూర్తిగా అనుభవిస్తూ తల్లిని ఆప్యాయంగా హత్తుకుని రేపు ఏ విధంగా శశాంక్ గారికి తన కృతజ్ఞతలు తెలుపుకోవాలా అని ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయింది శశి.

'అరే శశి. నువ్వా... ప్లీజ్ కమ్ ఇన్. ఏమిటీ ఇంత ఉదయాన్నే. ఆల్ వెల్ కదా' అని అడిగారు శశాంక్.

'సార్. మీకు మనస్ఫూర్తిగా థ్యాంక్స్ చెప్దామని వచ్చాను. నా సర్టిఫికెట్స్ కి నాకు ఎక్కడైనా జాబ్ వస్తుంది కానీ ఒక మానవత్వం ఉన్న మనిషిగా మీరు నాకు పునర్జన్మనిచ్చారు. దానికి మీకు నేను జీవితాంతం రుణపడి ఉంటాను' అంటూ వినయంగా చేతులు జోడించింది.

'శశీ... కమ్ ఆన్. ఐ హేవ్ డిసైడెడ్. ఈ జాబ్ నీకే. మాకు నీలాంటి వాళ్ళే కావాలి. నీకు కష్టం విలువ తెలియడానికే ఇదంతా చేసానమ్మా. రేపే వచ్చి నువ్వు మాతో నీ కొత్త జీవితం ప్రారంభించవచ్చు'.

మరునాడు ఉదయాన్నే లేచి గుడికి వెళ్ళి వచ్చింది శశి. అమ్మతో, అక్కతో మొట్టమొదటిసారిగా గర్వంగా నడుస్తూ అమ్మ చేయి పట్టుకుని ఆఫీసు మెట్లు ఎక్కుతూ ఉన్న శశిని చూసి నా కళ్ళు ఆనందం తో చెమర్చాయి. నేనిన్నాళ్ళూ ఎదురుచూసింది దీనికోసమే. ముగ్గురూ కలిసి శశాంక్ కేబిన్ లోకి వెళ్ళారు.

'సార్ మా అమ్మ గారు. మా అక్క' అని ఎంతో ఆప్యాయంగా పరిచయం చేస్తూ నాదో చిన్న రిక్వెస్ట్ సార్... నా అపాయింట్ మెంట్ ఆర్డరు మీ చేతులతో మా అమ్మకి ఇవ్వండి' అని అడిగింది శశి.

శశాంక్ వెంటనే అపాయింట్ మెంట్ లెటరు పార్వతి చేతులలో పెడుతూ, 'అమ్మా. మీ కష్టం ఫలించిన రోజు. దీని ప్రతిఫలం ముందు మీకే దక్కాలి. మీరిన్నేళ్ళు నీరు పోసి పెంచిన మొక్క ఈ రోజు మధురమైన ఫలాలు మీకు ఇవ్వనుంది. మీ చేతులతో మీ అమ్మాయికి ఈ లెటర్ ఇచ్చి జీవితంలో తను ఎంతో ఎత్తుకి ఎదగాలని ఆశీర్వదించండమ్మా' అన్నారు శశాంక్. నీళ్ళు నిండిన కళ్ళతో పార్వతి ఆ లెటర్ తీసుకుని శశి చేతులలో పెట్టింది.

భగవంతుడా... ఈ వయస్సులోనైనా మా అక్కకి అండనిచ్చావు. దానినలాగే జీవితాంతం ఉండనీ. ఇక అక్క ముఖంలో బాధ అనేది రానీకు' అని మనసులోనే నమస్కరించాను.

***




క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు వరసగా నుంచున్నట్టు బస్టాండ్ లో బస్సులు నిల్చుని ఉన్నాయి.

నేనూ, నా భార్యా, మా అబ్బాయియీ ఒక్కో బస్సూ ఎక్కడికి వెళుతుందో చూస్తూ మేము ఎక్కవలసిన బస్సు కనిపించగానే 'హమ్మయ్యా' అని మనసులో అనుకుని నెమ్మదిగా బస్ ఎక్కాము. అది అప్పటికే జనం తో నిండివుంది. మేము రిజర్వేషన్ చేసుకుని వుండడంతో మా ఆవిడ్నీ అబ్బాయిని మధ్యలో వున్న వాళ్ళ సీట్ లో కూర్చోబెట్టి ముందుసైడు వున్న నా సీట్ వైపు వచ్చాను. అక్కడ అప్పటికే విండో సైడు ఒకాయన కూర్చున్నాడు.

"ఏవండీ, మీరు కూర్చున్న సీటు నాది కాస్త జరుగుతారా?" అన్నాను.

"నాకు బస్సు ప్రయాణం పడదు. విండో సైడు అయితే కాస్త గాలి పీల్చుకోవచ్చని కూర్చున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే

కూర్చుంటాను.. లేదంటే జరుగుతాను" ప్రాధేయ పూర్వకంగా ఆన్నాడు.

నాలాగానే వయసులో పెద్దవాడు. ఆయన్ని ఇబ్బంది పెట్టడమెందుకని నవ్వి "నాకేం ఫర్వాలేదండీ" అన్నాను ఆయన పక్కన కూర్చుంటూ.

ఆయన ముఖంలో గొప్ప రిలీఫ్ కనిపించింది.

మంచితనం.. మానవత్వం.. గురించి అందరం గొప్పగా మాట్లాడతాం కాని, ఇలాంటి చిన్న చిన్న సర్దుబాట్లు మనసుకి గొప్ప ప్రశాంతతనిస్తాయి.

"మీరెక్కడికి వెళ్తున్నారు?" నేను చేసిన చిన్నపాటి సహకారానికి నా మీద సదాభిప్రాయమేర్పడి మాటలు కలుపుదామని ఆయన చేస్తున్న ప్రయత్నమని నాకనిపించింది.

"గుంటూరండీ" బదులిచ్చాను.

"ఆహా! నేనూ గుంటూరే! పెళ్ళికెళుతున్నాము. పెళ్ళి ఇవాళ రాత్రికే.. అందుకే ఆదరబాదరగా బయల్దేరాం" అన్నాడు. మీరే పనిమీద వెళుతున్నారో చెప్పలేదన్నట్టు.

"మా తమ్ముడి కూతురు పెద్దమనిషయ్యింది..'వచ్చి నాలుగక్షింతలెయ్యరా' అంటే వెళుతున్నాను. ఇవాళ సాయంత్రమే ఫంక్షన్" అన్నాను.

"అలాగా.. రిటైరయ్యారా.. ఏం చేసేవారు?"

"నేను ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. మాదాంట్లో రిటైర్మెంట్ పెద్ద కంపల్సరీ కాదు. అందుకే అరవై రెండేళ్ళొచ్చినా ఇంకా ఉద్యోగిగా కొనసాగుతున్నా"

"మీరు.."

"గవర్న్ మెంట్ స్కూల్లో ప్రిన్స్ పల్‌గా పనిచేసి రెండేళ్ళక్రితం రిటైరయ్యాను."

"బావుందండీ.. అదృష్టవంతులు.. రిటైరయి హాయిగా పెన్షన్ తో కాలం గడిపేస్తున్నారు" అన్నాను.

"మీరన్నది నిజమే!.. కానీ ప్రతి మనిషికీ ఒక సమస్య వుంటుంది. ఒక విషయంలో కాకపోతే మరో విషయంలో.." అన్నాడు కాస్త నిరాశని మాటలకి పులిమి.

"అన్నట్టు నా పేరు రాజారావు.. మరి మీ పేరు" అన్నాను వాతావరణాన్ని తేలికచేయడానికి మాట మార్చుతూ.

"జనార్ధన్.."

అంతలో డ్రైవర్ బస్ ఎక్కి స్టార్ట్ చేశాడు. కండక్టర్ బస్సెక్కి లోపలికొచ్చి అందర్నీ ఒకసారి పరికించి బస్ నిండడంతో "రైట్" అన్నాడు.

బస్సు రొద చేస్తూ కదిలింది. బస్ స్టాండ్ నుండి బస్ ని కొద్ది దూరం తీసుకొచ్చి నిలిపాడు డ్రైవర్. కండక్టర్ టికెట్లు చెక్ చేస్తున్నాడు.

"మీకెంత మంది పిల్లలు?" మళ్ళీ జనార్ధన్ గారు మాటలు ప్రారంభించారు.

"ఒక్కడే కొడుకు హైటెక్ సిటీలో రెండేళ్ళ నుండి పనిచేస్తున్నాడు. మా ఆవిడా వాడూ మన వెనకాల రెండు సీట్ల అవతల కూర్చున్నారు.. మీకెంతమంది పిల్లలు?"

"నాకు ఒక కొడుకు కూతురు. మావాడు కూడా ఉద్యోగస్థుడై దూరతీరాల్లో సెటిలైపోయాడు. అప్పుడప్పుడు సెల్ లో వినిపిస్తాడు. కనిపించడు. నేను కన్ను మూసేలోగా అమ్మాయి పెళ్ళి చేయాలి అదే నాకున్న ఒకాగానొక్క కోరిక.. బెంగ. మా ఆవిడా అమ్మాయీ అదిగో ఆ పక్కగా కూర్చున్నారు" అన్నాడు.

అంతలో మా అబ్బాయి మా ఆవిడ ఫ్లాస్కులోంచి పోసిచ్చిన కాఫీ గ్లాసు పట్టుకునొచ్చి నాకిచ్చాడు. "వీడే మా అబ్బాయి" అని క్లుప్త పరిచయం చేసి "అంకుల్ కి కూడా మరో గ్లాసులో పోసిమ్మని అమ్మకి చెప్పు" అన్నాను బావుండదని.

"అబ్బెబ్బే వద్దండీ.. నేను కాఫీ తాగకూడదు. హోమియో మందు వేసుకుంటున్నాను." అన్నాడు కంగారుగా.

నేను నవ్వి "సరేలేండి. నాకు కాఫీ అంటే ప్రాణం. మా ఆవిడ ఎక్కడైనా దానికి లోటులేకుండా చేస్తుంది." అన్నాను.

"మళ్ళీ అనక తప్పడంలేదు.. మీరు అదృష్టవంతులు" అన్నాడు.

బస్సు బయల్దేరింది.

ఆయన భార్య మధ్యలో ఒకసారి వచ్చి ఆయనకేవో ట్యాబ్లెట్లు, మంచి నీళ్ళు ఇచ్చి వెళ్ళింది.

నా వంక చూసి "నాకు బీపి సుగరు.. మందులు తప్పవు" అన్నాడు విచార వదనంతో.

"కనిపెట్టుకుని వుండే భార్య వుంది మీరూ అదృష్టవంతులే!" అన్నాను చిలిపిగా.

***

బస్సు ఒక హోటల్ ముందు ఆగింది.

కండక్టర్ పెద్ద గొంతుతో "లంచ్ చెయ్యవలసిన వాళ్ళు చేసేయండి. ఒక అరగంట తర్వాత బస్సు బయల్దేరుతుంది." అన్నాడు.

మాకు బయట తినడం ఇష్టముండదు. ప్రయాణాల్లో మాఆవిడ భోజనానికి కావల్సినవి చక్కగా సిద్ధం చేస్తుంది. కాస్త ఏ చెట్టుక్రిందో నీడపట్టున తిందామని మేమూదిగాం.

మా విషయం తెలిసి జనార్ధన్ గారి ఫ్యామ్లీ హోటల్ కి వెళ్ళారు. మేము కొద్ది దూరంలో వున్న పెద్ద చెట్టు నీడలో కూర్చుని తినడం మొదలెట్టాము.

వాళ్ళు పదిహేను నిమిషాల్లో లంచ్ చేసి మా దగ్గరకొచ్చి కూర్చున్నారు. వాళ్ళ అమ్మాయి అందగత్తె క్రిందే లెక్క. కలుపుగోలుతనమూ వుంది. మా ఆవిడ్ని కూడా భోజనానికి కూర్చోమని తను వడ్డించడం మొదలెట్టింది. మాటల మధ్యలో వాళ్ళమ్మాయి చక్కగా చదువుకుందనీ ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగంచేస్తోందని చెప్పాడాయన. మాటల్లో మేము మరి కాస్త దగ్గరయ్యాము.

బస్సెక్కి కూర్చున్నాము. కొంతమంది అప్పటికే వచ్చి కూర్చునివున్నారు.

"అన్నట్టు మీకు అమ్మాయి పెళ్ళి ఒక్కటే బెంగ అన్నారు కదా! మరి సంబంధాలు చూశారా?" అడిగాను ఏదో మాట్లాడాలని.

ఆయన ముఖంలో మళ్ళీ విచారం అలుముకుంది.

'అయ్యో అనవసరంగా కదిపాను ఈయన్ని' అనుకున్నాను.

"ఆ..చాలా..కానీ అదేం దురదృష్టమో ఒక్కటీ సెటిలవలేదు. నేను కట్నమెక్కువగా ఇచ్చుకోలేను కానీ అదేమీ అడ్డంకిగా అనిపించడంలేదు. అమ్మాయికి కుజ దోషాల్లాంటివి కూడా లేవు. మొన్నోసారి శ్రీ కాళహస్తి వెళ్ళి రాహుపూజ కూడా జరిపించాం. ఏ

దేవుడన్నా కరుణించి నేను చనిపోయేలోపు దాని నెత్తిమీద ఇన్ని అక్షింతలు వేసేలా దీవిస్తాడని ఎదురుచూస్తున్నాను." అన్నాడాయన.

కొద్ది సేపు నిశ్శబ్దం మా మధ్య చోటుచేసుకుంది.

నేను మా అబ్బాయిని పిలిచి ఆయన పక్కన కూర్చోబెట్టి.. కొద్ది సేపు మా ఆవిడతో మాట్లడడానికి వెళ్ళాను.

అరగంట తర్వాత మళ్ళీ నా సీటు దగ్గరకి వచ్చాను. మా అబ్బాయీ ఆయనా చక్కగా మాట్లాడుకుంటున్నారు. నన్ను చూసి మావాడు లేచి సీటిచ్చాడు.

నేను కూర్చుని మా గురించి కొంత చెప్పి ఆయన కుటుంబం గురించి అన్నీ తెలుసుకుని ఆయన్ని అంచనా వేసే ప్రయత్నం చేశాను. నాకు మనస్థత్వ శాస్త్రం పట్ల వున్న అభిరుచితో కొంతకాలం నేర్చుకున్నాను. మనిషి పెద్దగా ఆశలు లేనివాడు. కొడుకు దూరంగా వుండి తమని పట్టించుకోక పోయినా అతనన్నా హాయిగా వుంటే చాలన్న మంచితనం వున్న బోళామనిషి. పెళ్ళామంటే గౌరవం.. అభిమానం.. ప్రేమ. వాళ్ళందరి మనస్థత్వాలు నచ్చాయి.

కొద్దిసేపటి తర్వాత నేను వెనక్కి చూశాను. మా ఆవిడ నవ్వుతూ తలూపింది. మా అబ్బాయివంక చూశాను. వాడి ముఖంలో కొత్త కాంతి.

బస్సు ఆగింది. కండక్టర్ "ఇక్కడ టీ బాగుంటుంది. తాగేవాళ్ళు తాగండి. పక్కనే టాయిలెట్లు వున్నాయి. ఫ్రెష్ అవ్వండి. మూడు గంటల్లో మనం గుంటూర్లో వుంటాం. ఇంకెక్కడా బస్సు ఆగదు" అన్నాడు.

మేము బస్ దిగాము.

"చూడండి జనార్ధన్ గారూ, నేనూ మధ్యతరగతి వాడినే! మా అబ్బాయికి సంబంధాలు చూద్దామనుకుంటున్నాము. కాని అదృష్టవశాత్తు ఈ బస్ లోనే పెళ్ళి చూపుల్లాంటివి జరిగిపోయాయి. మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చింది. మమ్మల్ని మా పెద్దతనాన ఆప్యాయంగా చూసుకునే అమ్మాయి కోడలిగా మాకు కావాలి. మీరు కూడా మాట్లాడుకుని 'ఊ' అంటే తర్వాతి

కార్యక్రమాలు చూసుకుందాం" అన్నాను.

ఆయన కళ్ళలో ఆనందబాష్పాలు. సంతోషంతో నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఉద్వేగంతో ఊపేశాడు.

వెళ్ళి వాళ్ళావిడకీ, పిల్లకి విషయం చెప్పాడు. ఆవిడ మా ఇద్దరి దగ్గరకి వచ్చి "అన్నయ్య గారూ ఏ జన్మలో ఏం పుణ్యం చేసుకున్నామో.. మాకూ మా అమ్మాయికీ ఇంతటి అదృష్టం కలిగింది." అంది.

"అదిగో అక్కడ ఒక పక్కగా బండి మీదా పూలు పళ్ళూ వున్నాయి. పదండి కొనుక్కుని మార్చుకుందాం" అన్నాను నవ్వుతూ.

పూలు పళ్ళూ ఇచ్చి పుచ్చుకున్నాం.

"మళ్ళీ హైద్రాబాదు వెళ్ళాక దగ్గర్లో మంచి ముహూర్తం చూసి విళ్ళిద్దరినీ ఒక్కటి చేద్దాం." అన్నాను.

నాకెందుకో చాలా సంతోషంగా వుంది. మొదట్నించి నావి అభ్యుదయభావాలే! 'నేనూ.. నా..' అంటూ సంకుచితత్వంగా గిరిగీసుకుని వుండడం నాకు ఇష్టముండదు. సమాజంలో మనం బ్రతకడానికి ఎంతోమంది ఎన్నో రకాలుగా సహాయం చేస్తారు (కాసేపు డబ్బు విషయాన్ని పక్కనబెడితే). మళ్ళీ ఎవరికి వారు తమదైన లోకంలోకి ముడుచుకుపోతారు. ఎందుకో అర్ధం కాదు. ఈ భూమ్మీదకి నాలుగురోజుల కోసం వచ్చాం.. ఆహ్లాదంగా గడిపి వెళ్ళిపోవాలి. అంతే! నేను తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మా రెండు కుటుంబాల వాళ్ళం సంతోషించాం. అది చాలదా.. మానసిక తృప్తికి.

అందరి మనసులు తేలికయ్యాయి.

బస్ ఎక్కాము. ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చోబోతుంటే.. నేను "ఆగండి, నేనూ, బావగారూ ఇక్కడ, మా ఆవిడా, చెల్లెమ్మా అక్కడ, ఇహ మీ కుర్రజంట ఆ సీట్లో కూర్చుని గుంటూరు చేరేవరకూ హాయిగా ప్రేమ కబుర్లు చెప్పుకోండి.. ఒకరిగురించి ఒకరు పూర్తిగా తెలుసుకోండి." అన్నాను.

బస్సు బయల్దేరింది. ఇప్పుడు దాని రొద బాజాభజంత్రీల్లా అనిపించసాగింది.

***




"మిస్టర్ పార్వతీశం..." అంటూ బిల బిలా ఇంట్లోకి గబ గబా వచ్చేసిన ఆ పదిమందినీ కాశ్మీర్ సరిహద్దుల్లోకి చొరబడిన పాకిస్తానీ మిలిటెంట్ లని చూసినట్లు గాభరాగా చూసాడు పార్వతీశం. అందులో ఒకటో, రెండో ముఖాలు కాస్త పరిచయం వున్నట్లు తోచినా మిగతా అన్ని ముఖాలు... ప్చ్... ఎబ్బే... ఎంత ఆ... లో... చించినా, పరిచయం మాట దేముడెరుగు కనీసం ఎప్పుడూ చూసిన పాపాన కూడా పోలేదు... పాపం...

"రండి రండి... ఏమిటీ గణేష్ చందాలా... వాణీ... ఆ పర్స్ ఇలా పట్రా..." ఇటు వచ్చిన వాళ్ళని ఆహ్వానిస్తూ అటు భార్య వాణిని కేకేసాడు....

"ఏమిటీ, మేం మీ కళ్ళకి చందాల వాళ్ళలా కనిపిస్తున్నామా, ఎంత మీరు బేంక్ మేనేజర్ అయినా మరీ అంత ఎడిసిపాటు పనికిరాదు..." వురిమాడో పెద్దమనిషి.

"అయ్యయ్యో... నా వుద్దేశ్యం..." కంగారుపడ్డాడు... పార్వతీశం.

"ఏమిటి మరి మీ వుద్దేశ్యం, చేసేదంతా చేసేసి ఎలా మాటాడుతున్నాడో చూడు, నంగనాచిలా..." గుడ్లురిమేడో పెద్దాయన.

"అయ్యా... అసలు మీరెవరో... ఎందుకిలా వురమని పిడుగులా నా మీద విరుచుకు పడుతున్నారో... నాకేం అర్ధం కావటంలా... దయచేసి మీరు కాస్త శాంతించి... నా మీద ఎందుకిలా విరుచుకు పడుతున్నారో... నే చేసిన తప్పేంటో... కాస్త వివరంగా చెబుతారా..." అయోమయంగా అడిగాడు.

"ఇంకా ఈ పెద్దమనిషితో మాట్లేమిటండీ... ఇదిగో చూడండీ... మీకు ఒక వారం టైం ఇస్తున్నాం... మీరు వెంటనే ఇల్లు ఖాళీ చేసెయ్యాలి... లేకపోతే... మీ మీద లీగల్ గా ఏక్షన్ తీసుకోవాల్సి వుంటుంది..." వచ్చిన వాళ్ళలో ఒకాయన లాయర్ కాబోలు... చుర చుర చూస్తూ చెప్పాడు....

"ఏమిటీ ఇల్లు ఖాళీ చెయ్యాలా... ఎందుకు?" అదిరిపడి అడిగాడు.

"ఎందుకంటే మీ వలన మా అందరికీ ప్రశాంతతత లోపించింది కనక, మా ఆడాళ్ళూ అష్ట కష్టాలు పడుతున్నారు కనుక..." ఆవేశంగా ఆరోపించాడు పక్కింటి పట్టాభి.

"అదేమిటండి... అసలు మీరంతా ఎవరో కూడా... నాకు తెలియదు... నా మానాన్న నేను పొద్దున్న పోతే రాత్రి ఎప్పుడో వస్తాను... నా వలన మీ ప్రశాంతతత లోపించడం ఏమిటీ?... ఇంకా ఏమన్నారూ... నా వలన మీ ఆడాళ్ళు... అష్ట... కష్టాలు... రామ... రామ... ఎంతెంత అభాండాలు..."

వింటున్న వాణికి వళ్ళు మండి పోయింది..."

"ఏమిటండీ... వాళ్ళతో మాటలూ... ఇంటిమీద కొచ్చి గొడవచేస్తున్న వాళ్ళతో..." విసురుగా అంది.

"నువ్వుండు... వాణీ... అసలు వాళ్ళ సమస్య ఏమిటో... తెలిస్తే కదా... సార్... చూస్తే మీరంతా పెద్దమనుషుల్లా వున్నారు... అసలు సమస్య ఏమిటో చెబితే గదా విషయం తెలిసేది... మా తప్పేమిటో తెలిసి... సరిదిద్దుకో గలిగేది... దయచేసి ఎవరో ఒకరు విషయం కాస్త అర్థం అయ్యేలా చెప్పండి..." మృదువుగా అడిగాడు.

"హూ... విషయం ఏమీ చిన్నా చితకదీ కాదు... పోనీ... అని సరిపెట్టుకోడానికి... మీ వలన... మా ఇళ్ళల్లో... పనిమనుషులెవ్వరూ పనిసరిగా... చెయ్యడం లేదు... అన్నింటికీ రూల్స్... మాట్లాడుతున్నారు..., ఈ నెలలో మా పనిమనిషి పది నాగాలు పెట్టింది అదేమిటీ... అంటే..., "నాకు వంట్లో బాగానేక సెలవెడితే... ఏటంటారు... ఏం... మేం మాత్రం మనుషులు కామా... మాకు రోగాలు రావా...." అంది... వుడికిపోతూ అన్నాడు ఓ వెంకట్రావు.

"అదేనండీ... ఈ పనిమనుషుల్లందరికీ... ఒక్కసారే... రోగాలెందుకొచ్చాయో... తెలుసా... ఇదిగో... వీళ్ళింట్లో పనిచేసే రాములమ్మకి మొన్న నీమధ్య కొంచెం జ్వరం వస్తే... అయ్యో జ్వరంలో కూడా వచ్చి పనేం చేస్తావ్... ఇంద... ఈ ఐదు వందలూ తీసుకో... డాక్టర్ దగ్గరికి వెళ్లి చూపించుకు మందులు వాడు... మా అవస్థ ఏదో మేం పడతాం.

నాలుగు రోజులు విశ్రాంతి తీసుకో... జ్వరం తగ్గేకా రా... అని... ఈయన గారు... వుదారంగా డబ్బిచ్చి మరీ పంపేడట.... అక్కడకీ.... వాళ్ళావిడ అలా వాళ్ళని నెత్తికెక్కించుకోకండీ... అని మొత్తుకుంటే... పాపం... మరీ అంత దారుణంగా వుండకు... ఏం... వాళ్ళు మాత్రం మనుషులు కాదా... మనం చేసేది పెద్ద కూలి... వాళ్ళూ చేసేది... చిన్న కూలి... అంటూ... దాని ఎదుటే...

"అదీ... సంగతి... అందుకే ఆ రాములమ్మ... ఈ పనిమనుషుల్లందరినీ పోగేసి... మనకీ నెలలో కనీసం నాలుగు రోజుల సెలవు కావాలి... ఏం వాళ్ళకేనా ఆదారాలు... పండగ సెలవలూ, అలాగే మా అమ్మగోరూ, అయ్యగోరూ ఏడాది కోపాలి... ఒక నెల జీతం బోనస్ ఇత్తారు... అట్టానే... ఆరు ఏ వూరైనా ఎడితే... నన్నూ తీసికెల్తారు... అందుకే... ఆరు ఎన్ని ఇళ్ళు మారినా... నాను ఆరింట్లో పని మానేను... కాస్త దూరం ఐనా, మళ్ళీ ఈ పని సులువు కోసం... బట్టలుతికే మిషనూ... బూజులు దులిపే మిషన్నూ... అన్నీ ఇచ్చి... ఆటితో ఎట్టా సెయ్యాలో... ఆ యమ్మ నాకు నేర్పింది... మీరు వూరికే కట్టపడిపోక... మీ ఇల్లలో ఆయన్నీ ఇస్తేనేపని

సేత్తాం... నేకుంటే నేదు అని సెప్పండెహే..." అని వీళ్ళకి... బాగా ఎక్కించడం... అది తలకెక్కి... వీళ్ళు... మా ఇళ్ళలో... అవన్నీ డిమేండ్ చెయ్యడం... ఏమిటిదంతా... అని కారణం వెదికితే... ఇదుగో... ఇదీ విషయం... వీళ్ళేమో... దయా జాలి కలవాళ్ళు... మనమేమో... వాళ్ళ రక్తమాంసాలు పిండేసి... రాక్షసులం..." కోపంగా హుంకరించాడో... పరమేశం...

"అయ్యయ్యో... మేం అలా ఎందుకు చేస్తామండీ... పాపం... మా రాములమ్మకేదో... వంట్లో బాగాలేదంటే..."

"అదే... మీరేమో... అయ్యో... పాపం... అనుకుని... మీ రాములమ్మని అపురూపంగా చూసుకుంటున్నారు... అదేమో విషయం బాగా అర్థం చేసుకుని... వీళ్ళందరికీ బాగా నేరిపి పెడుతోంది... ఇంకో విషయం తెలుసా... మీరంటే రెండు చేతులా సంపాదిస్తున్నారు కనుక పని మనిషికి వేలల్లో జీతాలిస్తున్నారు... అది చూసి మిగతావాళ్ళంతా... అందరినీ అలాగే ఇవ్వాలని డిమేండు చేస్తున్నారు... ఇదంతా మీరు తెలిసే చేస్తున్నారో... తెలియకే చేస్తున్నారో కానీ... ఇక్కడ మధ్యలో మాకు... మాకండీ... దాని ఎఫ్ఫెక్ట్..." ఆవేశపడిపోయాడో... ఆనందరావ్.

"ఏదో... పాపం వాళ్ళ కష్టం... మనకెందుకనీ..." నీళ్ళు నమిలేడు పార్వతీశం.

అప్పటికి వాణికి విషయమంతా అర్థమయ్యింది... "ఇదిగో చూడండి... మేం మా పనిమనిషి వరకే ఆలోచించాం కానీ... ఇది వెళ్ళి. మేం మంచి అనుకుని చేసిన పని ఇలా అందరికీ ఎక్కించి అది లీడర్ అయి..., ఇంత రాజకీయం చేస్తుందనుకోలేదు. సరే... మాకెటూ బదిలీ అయిపోయింది... మేం వేరే ఊరెళ్ళిపోతున్నాం... ఒక రకంగా మీరు ఇలా వచ్చి మాకు ఓ విషయం తెలిసేలా చేసారు., మనం మంచి అనుకునీ పాపం, అనుకునీ... చేసే కొన్ని పనులు... వేరే వాళ్ళకి ఇబ్బంది అవుతాయనీ... అలాగే... ఎవరిని ఎక్కడ వుంచాలో అక్కడే ఉంచాలి కానీ... నెత్తికెక్కించుకుంటే... మొదటికే మోసం అనీ, మేం... ఈ నెలాఖరిలోగా వెళ్ళిపోతున్నాం... తెలియక చేసినా... మీకు ఇబ్బంది కలిగించి నందుకు మమ్మల్ని క్షమించండి... వెళ్ళి రండి..." అంటూ చేతులు జోడించింది.

"సర్లేండి... మేం కూడా వాళ్ళమీద కోపం మీ మీద చూపడం తప్పే... వాళ్ళని ఏం చెయ్యలేక... ఇలా మీ ఇంటిమీదకి వచ్చేం, మమ్మల్ని క్షమించండి... పదండర్రా." అంటూ వాళ్ళు వెళ్ళాకా.

"ఏం సారూ.. ఇప్పటికయినా అర్థం అయ్యిందా... మనం మంచి అనుకున్నది... వాళ్ళకి ఆయుధం అయ్యిందని..."

"ఏమిటో... మానవతావాదం... మరీ ఇంత ప్రమాదమా..." తల పట్టుకున్నాడు పూర్ పార్వతీశం.

***




రాఘవ మామయ్య రేపే మా ఇంటికి వస్తున్నాడు.

ఊర్నుండి అమ్మ ఫోన్ చేసి చెప్పిన ఆ వార్త నిజంగా నాకెంతో సంతోషాన్నిచ్చింది.

మాది కొత్తగా పెళ్లయిన జంట. ఇప్పుడు ఎవరైనా పానకంలో పుడకలావస్తే చిరాకేస్తుంది. కాని రాఘవ మామయ్య రాకని నేను మనస్పూర్తిగా స్వాగతిస్తున్నాను. కారణం మామయ్య అఘటనా ఘటనసమర్థుడు అందరికీ తల్లో నాలుకలా వుంటూ... తియ్యగా

మాట్లాడుతూ... ఎవరికి ఏది కావలసి వచ్చినా చేసిపెడుతూ నిత్యం బిజీగా వుండే ఆయన మా ఇంటికొస్తున్నాడు. అన్నట్టు ఆయన మా అమ్మకి ఏమీ కాడు. మరే విధంగాను నాకు మామయ్య కాడు. కాని ఊళ్ళో అందరికీ ఆయన మామయ్యే! ఆయన ఉండేది తెనాలిలో. నేను పుట్టింది పెరిగిందీ హైద్రాబాదులో. ఆయన గురించి నిజానికి నాకు తెలియదు. బంధువర్గం ద్వారా ఆయన గొప్పతనం వినడం తప్ప ప్రత్యక్షంగా ఆయన్ని చూడలేదు. మా పెళ్ళికి కూడా బిజీగా వుండి ఆయన రాలేదు. ఆయన్ని ఫోటోల్లో మాత్రమే చూశాను.

మరుసటిరోజు పొద్దున్నే ఆయన్ని తీసుకురావడానికి నేను కారులో రైల్వే స్టేషనుకి వెళ్ళాను.

ట్రైను రావలసిన టైముకే వచ్చేసింది. ఆయన్ని ఫోటోల్లో చూసి వుండడం చేతను... అమ్మ ఆయన ఏ కూపేలోంచి దిగుతుందీ చెప్పడం చేతనూ ఆయన్ని వెంటనే పోల్చుకుని "మామయ్యా.."అన్నాను.

ఆయన నా వంక నవ్వుతూ చూశాడు. కానీ ఆయన నవ్వు నా ఒక్కడికీ సొంతం కాదని ఆయన్ని పలకరించడానికి.. తమతో తీసుకెళ్ళడానికి చాలా మంది వచ్చారని ఒక గుంపు ఆయన వైపు వెళుతుంటే తెలిసింది. నేనుకూడా ఆయన దగ్గరకి వెళ్ళి నన్ను పరిచయం చేసుకుని మా ఇంటికి వెళ్దామన్నాను.

"చూశావుగా... వీళ్ళలో ఎవరిని నిరుత్సాహ పరచలేను. నువ్వోపని చెయ్... ఇంటికెళ్ళిపో... నేను వీలుచూసుకుని నీకు ఫోన్ చేసి వస్తాను... నీ నంబరు ఇవ్వు" అని బాగా దర్పంగా... డాబుగా కనిపిస్తున్న ఆయనతో వెళ్ళిపోసాగాడు.

నేను గబ గబ జేబులోంచి కాగితమ్ముక్క ఒకటి తీసి నా పేరు మా అమ్మ పేరు నా ఫోన్ నెంబరు రాసి పరిగెత్తుకుంటూ ఆయన్ని పట్టుకుని అది అందించాను. అది ఆయన చూడనుకూడా చూడకుండా జేబులో కుక్కుకుని వెళ్ళిపోయాడు.

చెప్పొద్దూ నాక్కాస్త నిరాశ కలిగింది.

ఇంటికి వెళ్ళంగానే మా ఆవిడ "ఏరండీ..మీ మామయ్య?" అడిగింది.

నేను జరిగింది చెప్పి"ఆయన అంత బిజీ అనుకోలేదు. ఆయనకోసం ఎంతమంది వచ్చారో తెలుసా? అబ్బో ఈ లెక్కప్రకారం

ఆయన గురించి నేను విన్నది చాలా తక్కువ. ఆయన ఏ పనైనా అవలీలగా చేయగలడు. ఆయనకున్న పరిచయాలు అలాంటివి మరి" అన్నాను.

"నిజమేనండోయ్! మనం ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న వాళ్ళం. అలాంటి నిచ్చెన వుంటే మనం తేలిగ్గా పైకి చేరొచ్చు. ఆయన్ని మాత్రం వదులుకోవద్దు"అంది.

"నిజమే కాని నేనిచ్చిన కాగితం ఆయన చూడను కూడా చూడలేదు. ఆయన మన ఇంటికి వస్తాడని నాకు నమ్మకం లేదు. అమ్మకి చెప్పాలి ఆయన పరిచయ భాగ్యం మనకి కలిగేలా చెయ్యమని" అన్నాను.

***

పొద్దుట పదకొండు గంటలకి ఆఫీసు పనితో చాలా బిజీగా వున్నప్పుడు నా సెల్ మ్రోగింది. కాల్ కట్ చేద్దామనుకున్నవాడిని ఎందుకైనా మంచిదని ఆన్సర్ చేశాను. అది మామయ్య నుండి. సారాంశమేమిటంటే ఈరోజు సాయంకాల బండికే ఆయన తెనాలి వెళ్ళిపోతున్నాడట అందుచేత ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ దగ్గరకి రాగలిగితే ఒక అరగంట మా ఇంట్లో గడిపి వెళ్ళిపోతాడట.

‘ఆహా! ఏమి నా అదృష్టమూ... ఏమి నా భాగ్యమూ...’ అనుకుంటూ మా ఆవిడకి ఫోన్ చేసి ఇవాళ మామయ్యని ఒక గంటలో మనింటికి తీసుకొస్తున్నాను. ఇంటిని అందంగా సర్దు. బయట మంచి రెస్టారెంట్ నుండి చక్కటి రుచికరమైన పదార్థాలు తెచ్చి తినడానికి సిద్ధం చేయి. ఆయన ఎంత ఇంప్రెస్ అవ్వాలంటే హైద్రాబాదు వస్తే మనమే గుర్తుకి రావాలి..ఆఁ." అన్నాను.

"అలాగేనండి... మీరు తొందరగా వెళ్ళండి లేకపోతే ఆయన్నెవరన్నా ఎగరేసుకు పోతారు. ఆయనకి మన మీద దయ కలిగింది చాలు." అంది.

నేను మా ఆఫీసరు కాళ్ళావేళ్ళాబడి బ్రతిమిలాడి పావుగంటలో ఖైరతాబాదు ఫ్లైఓవరు బ్రిడ్జి దగ్గరకి చేరుకున్నాను. ‘ఆయన వస్తాడా? అసలు నాకంత ప్రిఫరెన్స్ ఇస్తాడా? దేవుడా ఒక్కసారి ఆయన మాఇంటికి వచ్చేలా చెయ్’ మనసులో పరి పరి విధాల ఆలోచనలు.

"ఏవోయ్!" అని వినిపించిన వైపు చూస్తే... దూరంగా ఆడీ కారులోంచి మామయ్య విలాసంగా దిగుతూ ఆ కారులో ఆయనకి బై..బై

చెప్పి నా వైపు వడి వడిగా వచ్చి "తొందరగా మన ఇంటికి పోదాం పదవోయ్! అమ్మాయిని చూసి ఆటో ఎక్కేస్తాను. చెప్పాగా సాయంకాలమే బండి... స్టేషనుకి పరంధామం అని నాస్నేహితుడొకడు వచ్చి కలుస్తాడు. వాడితో కూడా ఒక అరగంట గడిపి తెనాలి వెళ్ళిపోతాను. లేకపోతే వాడు చాలా ఫీలైపోతాడు" అన్నాడు.

దేవుడు కరుణించాడు. నేను ఆయన్ని కారులో కూర్చోపెట్టి భక్తిప్రపత్తులతో డోర్ వేసి కారుని వేగంగా ఇంటివైపు పోనిచ్చాను.

ఇంటి దగ్గర దిగంగానే మా ఆవిడ ఆనందంగా ఎదురొచ్చి సాదరంగా ఆహ్వానించింది.

లోపలికెళ్ళాక "మామయ్యగారూ, మీ గురించి ఈయన ఎంతగా చెప్పాడో. మొన్న మీరు మా ఇంటికి రానందుకు రెండు రోజులు చాలా బాధ పడ్డారు. అన్నట్టు మనం తింటూ మాట్లాడుకుందాం..మీరు కాళ్ళూ చేతులూ కడుక్కుని లుంగీ కట్టుకోండి" అంది.

"భోజనమా? చెప్పాను కదటోయ్! నేను అరగంటలో బయల్దేరాలని... సర్లే మళ్ళీ అమ్మాయి బాధ పడుతుంది... అమ్మాయీ నువ్వు అలస్యం చేయకుండా వడ్డించేయ్ మరి" అని లుంగీ కట్టుకుని భోజనానికి కూర్చున్నాడు.

మా ఆనందం అంతా ఇంతా కాదు.

"నువ్వెక్కడ పని చేస్తున్నావు?" అడిగాడు.

నేను చెప్పాను. "అబ్బే ..అక్కడుంటే ఎదుగు బొదుగూ ఎలా వుంటుంది చెప్పు? హైటెక్ సిటీలో మనవాడొకడు హెచ్ ఆర్ లో మంచి పొజిషన్లో వున్నాడు. రిక్రూట్ మెంట్స్ అన్నీ వాడి చేతిలోనే వుంటాయి. నీకు సంబంధించిన డిటైల్స్ ఇవ్వు వాడికి చెప్పి చేయించేస్తాను."అన్నాడు.

మా ఇద్దరి ప్రాణాలు పక్షుల్లా హైటెక్ సిటీ మీద వాలాయి.

"మాదాపూర్ లో నా స్నేహితుడొకడు బిల్డర్. నేనెంత చెబితే అంత వెధవకి. అన్ని ఫెసిలిటీస్ వున్న చక్కటి ఫ్లాట్ ఒకటి నీ పేరున

బుక్ చేయమని చెబుతాను. లోన్లూ అవీ వాడే చూసుకుంటాడు. ఇల్లుంటే నీకూ ఐ టీ నుండీ రిలాక్సేషను లభిస్తుంది. కొంత కాలానికి సొంత గూడొకటి మిగవుతుంది.నెక్స్ట్ టైం నేను వచ్చినప్పుడు మీరు మాదాపూర్ లో మాంచి పాష్ లొకాలిటిలో వుండాలి " అన్నాడు. ఇప్పుడు మా ప్రాణాలు ఈ ఇరుకు ఇంట్లోంచి ఎగిరెళ్ళి పెద్ద పెద్ద ఆకాశ హర్మ్యాలమీద వాలాయి.

ఆ తర్వాత ఆయన ఊరినుండి పంపించిన ఇద్దరు ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్ కి మా ఆపీసులో జాబులు వేయించాను. ఇద్దరు ముగ్గురు తెలిసిన వాళ్ళని హాస్పిటల్లో ట్రీట్మెంట్ కోసం పంపితే మా ఇంట్లో వుంచుకుని జాగ్రత్తగా చూసుకున్నాను. ఆయన ఇంప్రెస్ అయితే నా పని తొందరగా అవుతుందని.

ఊర్లోవుండి.. ఇక్కడ హైద్రాబాదులో నా చేత తనక్కావలసిన పనులు చేయించుకుంటున్నాడు. మా ఆవిడకూడా నిరాశ వ్యక్తం చేస్తోంది. నేను ఆయనతో మాట్లాడదామని రెండు మూడు సార్లు ఫోన్ చేశాను. లేపలేదు. మొదట్లో 'పాపం బిజీ ఏమో' అనుకున్నాను. తర్వాత అర్ధమైంది. కావాలనే నా ఫోన్ ఎత్తట్లేదు. నా ద్వారా పని పూర్తయిన వాళ్ళ దగ్గర ప్రతిఫలం కూడా భారీగానే అందుకున్నాడట.. తర్వాత తెలిసింది. నాకు మాత్రం ఏమీ చేయలేదు. ఒకవేల చేసినా నేను భారీగా ముట్టజెప్పాలి.. ముందు ముందు ఆయన ఏం చెబితే అది చెయ్యడానికి సిద్ధపడాలి.. బానిసవ్వాలి. ఇలాంటి వాళ్ళు నా లాంటి వాళ్ళకి అరచేతిలో వైకుంఠం చూపించి తమ పనులు చేయించుకుంటారు. లాభ పడతారు. ఆశ మనల్ని వాళ్ళకి పూర్తిగా లొంగిపోయేలా చేస్తుంది. తమ మాటల చాతూర్యంతో మనుషుల్ని కట్టి పడేసి పబ్బం గడుపుకుంటారు. ఒకట్రెండు పనులు ఆయనవల్ల జరిగితే.. పెళ్ళిళ్లూ శుభకార్యాల్లో ఆయన గురించి గొప్పగా చెప్పేసరికి తన తల్లిలాంటి వాళ్ళు నిజమని భ్రమ పడతారు. మరీచికల వెంట పరుగులు తీస్తారు.

సెల్ మ్రోగింది. మా ఆవిడ "ఏవండీ మామయ్య గారు.." అంది.

నేను "తెలుసు. ఇంక ఆయన ఫోన్ ఎత్తను. మనం ఎత్తెక్కడానికి నిచ్చెన అవసరమే కాని అది స్వయం కృషి కావాలి.. ఇలాంటి వైకుంఠపాళి నిచ్చెన కాదు. అది ఎప్పటికైనా ప్రమాదమే! జీవితాన్ని కోల్పోయేలా చేస్తుంది." అన్నాను స్థిర నిశ్చయంతో.

***




"ఏంటంత అర్జంటుగా మాట్లాడాలని ఫోన్ చేశావు?" లోపలికి అడుగుపెడుతూనే అడిగింగి లాయర్ సంధ్య లాలిత్యని...

"ముందు కూర్చో... వెళ్ళిపోవాలా?" చిరాగ్గా అంది లాలిత్య...

"వెళ్ళేదాన్ని అయితే ఇక్కడికెందుకు వస్తాను... చెప్పు" అంటూ సోఫాలో కూర్చుంది సంధ్య...

లాలిత్య డైనింగ్ హాల్లోకి ఫ్రిజ్ లోంచి ఆరెంజ్ జ్యూస్ తీసి గాజు గ్లాసులో పోసి తెచ్చింది.

"ఎండనబడి వచ్చావు తాగు చిరాకు తగ్గుతుంది" అంటూ సంధ్య చేతికి గ్లాసు అందించింది.

సంధ్య గ్లాసందుకుని నవ్వుతూ అంది "చిరాకు కాదు, పరాకు కాదు... నువ్వలా కొంపలంటుకుపోతున్నట్టు ఉదయాన్నే ఫోన్ చేసి రమ్మంటే ఏం జరిగిందా అని టెన్షన్ తో వచ్చాను అంతే..."

లాలిత్య నవ్వలేదు... గడ్డం కింద చేయి ఆనించుకుని ఆలోచిస్తూ మౌనంగా కూర్చుంది.

"చెప్పవే..." ఆమెని పరీక్షగా చూస్తూ అంది సంధ్య...

సరిగా కూర్చుంటూ సంధ్య వైపు చూసి నింపాదిగా అంది "నాకు విడాకులు కావాలి..."

సంధ్య ఒక్క క్షణం తెల్లబోయి చూసి ఫకాల్న నవ్వి అంది... "ముందే చెప్పి ఉంటే బ్యాగులో వేసుకుని వచ్చేదాన్నిగా..."

"జోక్ కాదు సంధ్యా! నిజంగా చెబుతున్నాను... ఇంక మా ఇద్దరికీ పడదు... ఈ సంసారం సాగదు... విడిపోతే ఎవరి బతుకు వాళ్లు బతకచ్చు... ఒకళ్ల నొకళ్ళు ద్వేషించుకుంటూ ఒక గూట్లో ఎలా కలిసి ఉంటాం చెప్పు!"

సంధ్య లాలిత్య మొహంలోని సీరియస్ నెస్ గమనించింది... నెమ్మదిగా జ్యూస్ తాగుతూ ఆమె ఇంకా ఏం చెబుతుందో అన్నట్టు చూడసాగింది.

లాలిత్య ఇంకేమీ మాట్లాడకుండా మౌనంగా ఎటో చూస్తూ కూర్చుంది...

సంధ్యా, లాలిత్యా చిన్నప్పటి నుంచి క్లాస్ మేట్స్... సంధ్య లాయర్ అయింది... లాలిత్య ఇంజనీరు అయింది... సంధ్యకి స్వంతంగా ప్రాక్టీస్ ఉంది... మంచి సివిల్ లాయర్ గా పేరుంది. ఆ చనువుతోటే లాలిత్య ఈ నిర్ణయానికి వచ్చి సంధ్యకి ఫోన్ చేసింది ఓసారి రమ్మని. ఇలాంటిదేదో ఉందని సంధ్య ఊహించలేదు ఎందుకంటే వ్యాస్, లాలిత్యలది చక్కటి జోడీ. వ్యాస్ చాలా మంచివాడు. నెమ్మదస్తుడు, మర్యాదస్తుడు, ఏ చెడ్డ అలవాట్లు లేనివాడు... మంచి ఉద్యోగం, కంఫర్టబుల్ శాలరీ... ఒకరినొకరు కోరి చేసుకున్నారు... పెద్దలు చేసిన పెళ్లి అయినా కుదుర్చుకున్నది మాత్రం వాళ్లే... లాలిత్య కూడా మంచి పిల్లే... ఇద్దరూ

ఇంజనీర్లే... ఏమైంది?

సంధ్యకి అర్ధం కాలేదు... పడట్లేదు అంటే ఏం జరుగుతోంది... ఎందుకు పడడం లేదు... పెళ్లయి రెండేళ్లు అవుతోంది... అప్పుడే విడాకులు తీసుకునేంత గొడవలు ఏం జరిగి ఉంటాయి వీళ్ల మధ్య... "ఏం జరిగిందే? ఎందుకు ఇంత దూరం వచ్చావు" అడిగింది అనుమానంగా...

నిట్టూర్చింది లాలిత్య... "ఏం చెప్పను?" అంది ఆమె వైపు చూసి.

"ఏం జరుగుతుందో అదే చెప్పు..."

"ఏమీ జరగడం లేదు..."

"అంటే..."

"మా ఇద్దరి మధ్యా మాటా, మంతీ లేదు... సరదాలు, సరసాలు అసలే లేవు... తన దారి తనది నా దారి నాది అన్నట్టు ఉంటోంది. ఏమో మేము ఒకళ్ల నొకళ్ళు సరిగా అర్ధం చేసుకోకుండా తొందరపడి పెళ్లి చేసుకున్నాం అనిపిస్తోంది... అదృష్టవశాత్తూ మాకు పిల్లలు లేరు... ఉండి ఉంటే నేనీ విషయం ఆలోచించేదాన్ని కాదు..."

సంధ్య సాలోచనగా చూసింది.. "వ్యాస్ తో ఈ విషయం చర్చించావా?"

లాలిత్య కొన్ని నిమిషాల నిశ్శబ్దం తరువాత అంది... "తనే ఈ ప్రపోజల్ తెచ్చాడు..."

"తనే తెచ్చాడా?" విస్తుబోతూ చూసింది... "ఎందుకు? ఎప్పుడు? ఎలా?"

లాలిత్య మాట్లాడలేదు.. ఆమెకి నెలక్రితం వ్యాస్ కీ, తనకీ జరిగిన ఘర్షణ గుర్తొచ్చింది...

ఆ రోజు లాలిత్య ఆఫీస్ కి వెళ్లడానికి తయారై క్యాబ్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది... క్యాబ్ రాలేదు... ఫోన్ చేస్తే ట్రాఫిక్ లో ఉన్నానని చెప్పాడు డ్రైవర్...      ఆరోజు సి ఇ ఓ తో రెండు, మూడు మీటింగ్స్ ఉన్నాయని త్వరగా రమ్మని చెప్పాడు మేనేజర్. టైం అయిపోతోంది... టెన్షన్ గా బాల్కనీలోకి, లోపలికి తిరుగుతోంది లాలిత్య...

అంతలో వ్యాస్ ఆఫీస్ నుంచి హడావుడిగా వచ్చాడు...

భార్యని చూడగానే హుషారుగా అన్నాడు... "లాలి ఈ రోజు లీవు పెట్టేయవా? ఎటన్నా వెళ్లి సరదాగా ఎంజాయ్ చేద్దాం... నాకివాళ చాలా బోర్ గా ఉంది.."

"లీవా? ఇవాళా? ఇంకా నయం ఇప్పటికే క్యాబ్ రాలేదని టెన్షన్ పడుతున్నాను... కుదరదు సి ఇ ఓ తో మీటింగ్ ఉంది" అంది లాలిత్య.

"నాకన్నా నీకు సి ఇ ఓ తో మీటింగ్ ఎక్కువా? ఎన్నాళ్లైంది కాస్త సరదాగా గడిపి మనం... నాకీ మెకానికల్ లైఫ్ చాలా విసుగ్గా ఉంది. అసలు మనం భార్యా భర్తలమేనా అని అనుమానం కూడా వస్తోంది. కోపంగా అడిగాడు... ఆ అడగడంలో బాధా, ఉక్రోషం కలగలిసి అతని మొహాన్ని కందగడ్డలా మార్చేయడం గమనించింది లాలిత్య...

"ఏం చేద్దాం? మన ఉద్యోగాలు అలాంటివి... కొత్త ప్రాజెక్ట్ వచ్చింది... దానికి టార్గెట్ పెట్టి చంపుతున్నాడు మా మేనేజర్... పని, పని నువ్వు చూస్తూనే ఉన్నావుగా ఇంట్లో కూడా వర్క్ చేస్తూనే ఉన్నాను... హార్డ్ లీ ఫైవ్ అవర్స్ పడుకుంటున్నానేమో... అదే స్థాయిలో అంది లాలిత్య... మళ్లా అంది.. "నీ దారిన నువ్వు కూడా బిజీగానే ఉన్నావుగా! నన్నంటావేం? లాస్ట్ సాటర్ డే నేను టోటల్ ఫ్రీగా ఉన్నాను... నువ్వా ల్యాప్ టాప్ పెట్టుకుని కనీసం వంటలో సాయం కూడా చేయలేదు."

"నాదీ ఉద్యోగమేగా... నాకూ నెలకి యాభైవేలిస్తున్నారుగా... నేనూ పనిచేయాలి... కానీ, పనేనా జీవితం అంటే... అసలు మనం ఈ రెండేళ్లలో ఎన్ని రాత్రులు సంసారం చేశామో నీకు గుర్తుందా? ఇలాగే జరిగితే నువ్వు నా భార్యవన్న విషయం కూడా మర్చిపోతాను" కసిగా అన్నాడు వ్యాస్...

ఇంతలో క్యాబ్ రావడంతో లాలిత్య పరిగెత్తింది...

ఆ సంఘటన ఆధారంగా మర్నాటి నుంచి ఇద్దరి మధ్యా వాదోపవాదాలు, గొడవలు, అలకలు, కోపాలు ఎక్కువైపోయాయి...

"ఏనాడన్నా నా మొహాన కమ్మగా వండి పెట్టావా? మొగుడికి వంట చేసి పెట్టలేని పెళ్లాం నాకెందుకు?" మండిపడ్డాడు వ్యాస్ ఓ రోజు కయ్యానికి కాలు దువ్వుతూ...

"వంట పెళ్లామే చేయాలని రూల్ లేదు... నువ్వు కూడా చేయచ్చు... పోనీ నీకు పెట్టకుండా నేను పంచభక్ష్యపరమాన్నాలు చేసుకుతింటున్నానా? ఎందుకలా నోరుపారేసుకుంటావు?"

"నేను నోరు పారేసుకోడం కాదు... నువ్వే ఇంకెక్కడో నీ మనసు పారేసుకున్నావు... అందుకే నన్ను వదిలించుకోడానికి చూస్తున్నావు... ఈ ప్రపంచంలో నువ్వేనా ఉద్యోగం చేస్తున్న ఆడదానివి. నూటికి ఎనభై మంది ఆడవాళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు... వాళ్లంతా మొగుడితో కాపురాలు చేయడం లేదా? వండిపెట్టడం లేదా?" వెటకారంగా అన్నాడు వ్యాస్.

"షటప్... ఏం మాట్లాడుతున్నావు? ఇదేనా నీ భార్యమీద నీకున్న నమ్మకం, ఇదేనా భార్యని గౌరవించే పద్ధతి... నేనే ఆ మాట అంటే..." రెచ్చిపోయింది లాలిత్య...

సడన్ గా వెక్కి, వెక్కి ఏడవడం మొదలుపెట్టిన లాలిత్యను చూసి నిశ్చేష్టురాలైంది సంధ్య...

"ఏయ్ లాలిత్యా... కమాన్... ఏడవకు" ఆమె దగ్గరగా జరిగి కన్నీళ్లు తుడుస్తూ అంది "సరేలే నువ్వనుకున్నట్టేచేద్దాం... ఒకసారి అతనితో కూడా మాట్లాడటం నా ధర్మం... అతనుకూడా కావాలంటే ఆరునెలల్లో విడాకులు ఇప్పిస్తాను... సరేనా? కూల్ డౌన్..."

"ఏంటో సంధ్యా... మా ఇద్దరి మధ్యా రోజు, రోజుకీ గ్యాప్ పెరిగిపోతోంది... కొంతకాలం స్నేహితుల్లా ఆఫీస్ విషయాలు మాట్లాడుకుంటూ ఉండేవాళ్లం వీకెండ్స్ సినిమాకో, మాల్ కో వెళ్లి సరదాగా తిరిగి వచ్చేవాళ్ళం... ఈ మధ్య చాలా రొటీన్ గా,

మెకానికల్ గా అయిపోయింది లైఫ్... మా మధ్య అసలు మాటలు లేవు" కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పింది...

"ఒక్కసారి అతనితో కూర్చుని అతని మనసులో ఏముందో తెలుసుకోవచ్చుగా లాలిత్యా..."

"ఇంకా ఏం తెలుసుకోను? రోజూ గొడవలు, కోపాలు, అరుచుకోవడాలు... ఆఖరికి విడాకులు తీసుకుందాం నా మనసు విరిగిపోయింది అన్నాడు... నా మనసూ విరిగిపోయింది... విరిగినపాలతో పెరుగు తోడేయలేంగా సంధ్యా!"

సంధ్య నిట్టూరుస్తూ అనుకుంది "మీరొక్కళ్ళే కాదులే లాలిత్యా... ప్రస్తుతం వివాహవ్యవస్థలో ఏదో లోపం వస్తోంది... మంత్రాల్లో బలం తగ్గిందో, మనుషుల్లో మమతలు తగ్గాయో!"

అనుభవజ్ఞురాలైన సంధ్యకి బాగా తెలుసు... ఆవిడ దగ్గరకి రోజుకి కనీసం నాలుగు విడాకుల కేసులైనా వస్తుంటాయి... కొందరికి తప్పనిసరి పరిస్థితుల్లో విడాకులు ఇప్పించాల్సి వస్తోంది. అలాంటప్పుడు ఆమె ఎందుకీ వృత్తి ఎంచుకున్నాను నేను అని పశ్చాత్తాపపడుతూనే ఉంటుంది... ఆమెకి ఒక్కోసారి భార్యాభర్తల్ని విడదీస్తున్న పాపానికే తనకి ఏ సంబంధమూ కుదరక ముప్పై కి దగ్గరవుతున్నా పెళ్లికాలేదేమో అనికూడా అనిపిస్తుంటుంది. ఇప్పుడు స్నేహితురాలే తనచేత మరో పాపం చేయిస్తోంది.

"సరేలే శనివారం వస్తాను... ఇద్దరూ ఇంట్లో ఉంటారుగా మాట్లాడతాను... నువ్వింక రెస్ట్ తీసుకో నైట్ డ్యూటీ చేసి వచ్చావు... మళ్లీ సాయంత్రం ఆఫీస్ కి వెళ్ళాలిగా..." అంటూ సంధ్య వెళ్లిపోయింది.

లాలిత్య ఆలోచిస్తూ అక్కడే సోఫాలోనే వాలిపోయి కాసేపట్లో నిద్రలోకి జారిపోయింది...

వేదవ్యాస్, లాలిత్య కూడా ఒక పెద్ద కార్పోరేట్ కంపెనీలో పనిచేస్తున్నారు... లాలిత్యది అమెరికన్ బేసిడ్ కంపెనీ... ఆమె పనివేళలు రాత్రి ఎనిమిది నుంచి తెల్లవారిందాకా ఉంటాయి... వ్యాస్ ది సింగపూర్ కంపెనీ... ఉదయం పదకొండు నుంచి ఆరింటిదాకా... అతను ఇంటికి వచ్చే టైం, ఆమె ఆఫీస్ కి వెళ్లే టైమ్... పెళ్లి అయి కాపురం పెట్టిన ఈ రెండేళ్లలో వాళ్లు సరదాగా గడిపింది ఒక వారం రోజులు... అది కూడా లాలిత్య అక్క వారిజ వాళ్ల పెళ్ళికి గిఫ్ట్ గా హనీమూన్ కి టికెట్లు కొనివ్వడంతో తప్పలేదు... ఊటీ, మైసూరు, వగైరా తిరిగి వచ్చారు... ఆ తరువాత లీవులు అయిపోయి ఆఫీసుల్లో రిపోర్టు చేశారు... సోమవారం నుంచి శుక్రవారం దాకా ఇద్దరూ బిజీ.. కేవలం శని, ఆదివారాలే వాళ్లకి మిగిలేది... ఈ మధ్య ఇద్దరికీ పని ఒత్తిడి పెరిగింది... చిరాకులు, పరాకులు కూడా ఎక్కువైనాయి... ఒకళ్లు సర్దుకుపోవడానికి ప్రయత్నించినా, మరొకళ్ల పంతాలతో గొడవలు వస్తున్నాయి... ఇది

నాలుగోసారో, అయిదోసారో వాళ్లు గొడవపడడం… అందుకే లాలిత్య ఇద్దరికీ కుదరదని నిర్ణయించుకుంది. దానికి తోడు వ్యాస్ కూడా మనకి కుదరదు విడాకులు తీసుకుందాం అనడంతో ఆమె ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చి సంధ్యతో ప్రస్తావించింది. ఆ మర్నాటి నుంచి వ్యాస్ తో పూర్తిగా మాటలు మానేసింది.

ఇది జరిగిన నాలుగోరోజు ఉదయాన్నే వ్యాస్ తల్లి పవిత్ర విజయవాడ నుంచి సూట్ కేస్ తో దిగింది…

ముందుగా ఏమాత్రం తెలియచేయకుండా వచ్చిన తల్లిని చూసి ముందు ఆశ్చర్యపోయినా వెంటనే అమ్మ వచ్చింది కడుపునిండా తిండి తినచ్చు అని మురిసిపోయాడు వ్యాస్…

"అదేంటత్తయ్యా ముందు కబురు చేస్తే రిసీవ్ చేసుకునేవాళ్లం కదా" అంది లాలిత్య…

"అనుకోకుండా వచ్చానమ్మా… నా స్నేహితురాలి కూతురు పెళ్లి కూకట్ పల్లిలో… అందుకని వాళ్లతో వచ్చాను" అంది పవిత్ర…

ఆ తరువాత ఆవిడ వంటగది హ్యాండోవర్ చేసుకుంది… వ్యాస్ కి ఇడ్లీ, వడ, ఉప్మా లాంటి రక రకాల బ్రేక్ ఫాస్ట్ లు, మంచి వంటలతో క్యారేజిలు ఆవిడ వచ్చాక హాయిగా ఉంది. అలాగే కోడలికి కూడా ఒద్దన్నా వినకుండా రాత్రికి డిన్నర్ ఏం తింటావు వద్దంటే ఎలా అంటూ పుల్కాలు, కూర చేసి ఇస్తోంది పవిత్ర… తల్లి వచ్చాక వ్యాస్ కొంచెం త్వరగా రావడం మొదలుపెట్టాడు ఆఫీసు నుంచి… లాలిత్య కూడా అత్తగారు ఉన్న ఆ నాలుగురోజులూ త్వరగా వెళ్ళిపోతానని పర్మిషన్ తీసుకుంది ఆఫీసులో… ఆవిడ సడన్ గా రావడంతో వాళ్ల విడాకుల చర్చ కొద్ది రోజులు వాయిదా పడింది. సంధ్యకి ఫోన్ చేసి విషయం వివరించి ఆవిడ వెళ్లాక ఫోన్ చేస్తాను అని చెప్పింది లాలిత్య.

లాలిత్య సాధారణంగా ఉదయం ఐదింటికి వస్తుండేది… ఇప్పుడు మూడింటికల్లా క్యాబ్ దింపేస్తోంది… అంచేత మూడునుంచి ఉదయం ఏడింటిదాకా నిద్రపోయి లేచేయడంతో లాలిత్యకి అనుకోకుండానే తెలియని ఉల్లాసం కలగసాగింది… ఉదయం వ్యాస్ ఆఫీస్ కి వెళ్ళేలోగా అత్తగారితో కబుర్లు చెబుతూ వంటలో సాయం చేయడం, మధ్య, మధ్య అనుకోకుండానే వ్యాస్ తో మాటలు కలపడం జరిగింది… వ్యాస్ లో కూడా నిర్లిప్తత, చికాకు పోయి అటు తల్లితో, ఇటు లాలిత్యతో కూడా సరదాగా మాట్లాడుతున్నాడు… తమాషాగా ఆ ఇంట్లో స్తబ్దత పోయి ఏదో ఉత్సాహం, చైతన్యం వచ్చినట్టుగా అనిపిస్తోంది ఇద్దరికీ… నిశ్శబ్దంగా ఉండే ఇంట్లో టీవి మోగుతోంది… ఇంట్లో ఉన్నంతసేపూ పవిత్ర ఏవో తినుబండారాలు సప్లై చేస్తూనే ఉంటుంది…

శనివారం... ఇద్దరికీ సెలవురోజు...

లాలిత్య కాసేపు అత్తగారికి వంటలో సాయం చేసి వచ్చి లాప్ టాప్ పట్టుకుని కూర్చుంది...

వ్యాస్ టి వి చూస్తూ కూర్చున్నాడు... పవిత్ర వంట పూర్తి చేసి వచ్చి అంది... "సెలవు పూట కూడా పనేంటమ్మా కాసేపు రెస్ట్ తీసుకోవచ్చుకదా..."

లాలిత్య నవ్వింది.. "కార్పొరేట్ వాళ్లకి సెలవులు, వర్కింగ్ డేస్ అన్నీ ఒకటే అత్తయ్యా కంపెనీవాళ్లు ఈ ల్యాప్ టాప్ ఇచ్చింది ఇరవై నాలుగు గంటలూ పనిచేయడానికే తప్పదు..."

"ఏం దిక్కుమాలిన ఉద్యోగమో... వేరే ఉద్యోగం చేసుకోవచ్చుకదా..."

"మనకి కావాల్సినప్పుడు ఏం ఉద్యోగాలు దొరుకుతాయత్తయ్యా! ఏ కంపెనీ అయినా ఇంతే... టెక్నికల్ జాబ్స్ ఇలాగే ఉంటాయి."

ఆవిడేం మాట్లాడలేదు. కొద్ది క్షణాల తరువాత అంది. "ఎక్కడికన్నా తీసికెళ్ళకూడదూ నాకు విసుగ్గా ఉంది.."

"సారీ అత్తయ్యా... మీరూ, మీ అబ్బాయి వెళ్లిరండి... నాకు చాలా పని ఉంది..."

వ్యాస్ చురుగ్గా చూశాడు ఆ మాటకి... "పదమ్మా మనం వెడదాం" అన్నాడు సోఫాలోంచి లేస్తూ...

ఆవిడ పెదవి విరుస్తూ అంది... "పోనీలేరా ఆ అమ్మాయికి పని ఉందంటోందిగా.. ఒక్కదాన్ని వదిలేసి ఎక్కడికి వెడతాం?"

లాలిత్యకి బాధనిపించింది.. రాక, రాక వచ్చిందావిడ... వచ్చిన దగ్గర్నించి పాపం ఇంటెడు చాకిరీ మీద వేసుకుని చేస్తోంది. ఒక్కరోజు

ఆవిడ కోసం వెచ్చించకపోడం ధర్మం కాదనిపించింది... వెధవ పని రోజూ ఉండేదే అనుకుంటూ ల్యాప్ టాప్ పక్కన పెట్టి లేస్తూ అంది "వస్తాలెండి... లంచ్ చేసి వెళ్దాం... గోల్కొండ లైట్ అండ్ మ్యూజిక్ షో కి వెళదాం."

ఆవిడ కళ్ళు మెరిసాయి... చక, చకా డైనింగ్ టేబిల్ దగ్గర అన్నీ రెడీ చేసింది... ముగ్గురూ కలిసి భోజనానికి కూర్చుంటే ఆ అనుభవం కొత్తగా, వింతగా అనిపించింది... ఈ డైనింగ్ టేబిల్ వాడిన రోజులు చాలా తక్కువ... వర్కింగ్ డేస్ ఆఫీసులో, మధ్య, మధ్య ఇంట్లో తిన్నా ఏదో ఇంత ప్లేటులో పెట్టుకుని ఏ సోఫాలోనో కూర్చుని స్పూన్ తో తింటూ మధ్య, మధ్య ఐపాడ్ లో మెసేజ్ లు చెక్ చేసుకుంటూ భోజనం అయిందనిపించడం తప్ప ఇంత పద్ధతిగా వేడి అన్నం, వేడి సాంబారు, కూర, పచ్చడి, పెరుగుతో ఇలా తీరుబడిగా కూర్చుని భోజనం చేయడం ఎంత బాగుంది అనిపించింది వ్యాస్ కీ, లాలిత్య కీ కూడా...

ఇలా తినడానికి కూడా అదృష్టం ఉండాలి... ఈవిడ ఉన్నారు కాబట్టి కానీ, మళ్ళీ ఈవిడ వెళ్ళాక మామూలేగా... అయినా విడిపోతున్నాం కదా... ఎలా ఉంటే ఏం? అనుకుంది విరక్తిగా.

ముగ్గురూ ట్యాక్సీ మాట్లాడుకుని బయల్దేరారు... ముందు సీట్లో కూర్చోబోతున్న కొడుకుతో "నేను వెనకాల ఎక్కలేనురా మోకాళ్ళు నొప్పి నువ్వు వెనక కూర్చో" అంటూ తాను ముందు సీట్లోకి వెళ్ళింది పవిత్ర... తప్పనిసరి పరిస్థితుల్లో లాలిత్య పక్కన కూర్చోవాల్సి వచ్చింది వ్యాస్ కి... ఆమెకి ఎడంగా పొరపాటున కూడా తాకకుండా కూర్చున్నాడు... అతనలా కూర్చోడంతో లాలిత్యకి బాధతో పాటు కోపం కూడా వచ్చింది. ఎన్నడూ తనని తాకనివాడిలా దూరంగా కూర్చున్నాడు. అంత పనికి రాకుండా పోయానా అనుకుంది... మళ్ళీ విడిపోయేవాడితో నాకెందుకు ఎక్కడ కూర్చుంటే ఏం? ఈవిడ ఉన్నన్ని రోజులూ సరిపెట్టుకోవాలి అనుకుంది...

గోల్కొండ మొత్తం తిరిగి షో మొదలయ్యే టైం కి అక్కడ చేరి, లైట్ అండ్ మ్యూజిక్ షో చూశారు... ఆ జనంలో మధ్య, మధ్య వ్యాస్ తనకి తగలడం సారీ అంటూ దూరం జరగడం లాలిత్యకి గుండె కోస్తున్నట్టు అనిపించింది... అలాగే వ్యాస్ కి కూడా లాలిత్య అక్కడ కూడా తనతో నవ్వుతూ మాట్లాడకపోడంతో ఈమెకి నా మీద ప్రేమ పోయిందా? ఎందుకిలా దూరమవుతోంది అనిపించింది...

బైట డిన్నర్ చేసి ఇల్లు చేరేసరికి పదకొండు అయింది...

చీర మార్చుకుని నైటీ వేసుకుని వచ్చి ల్యాప్ టాప్ పట్టుకున్న కోడలిని చూసి నొసలు ముడేసింది పవిత్ర... "పడుకోమ్మా పెందలాడే లేపుతాలే అప్పుడు చేసుకో ఆ పని" అంది.

ఆవలిస్తూ "చాలా పనుందత్తయ్యా" అంది లాలిత్య...

"ఉంటే ఉందిలే రేపు ఆదివారమేగా చేయచ్చు పడుకో ఆరోగ్యం పాడుచేసుకోకు... వేళకి తిండీ, నిద్రా లేని ఉద్యోగం దేనికి? ఆ సంపాదన దేనికి?" చిరాకు పడిందావిడ...

అత్తగారి ఎక్స్ ప్రెషన్స్ చూసి ల్యాప్ టాప్ మూసేస్తూ అనుకుంది లాలిత్య అవును నిద్రవస్తోంది ఉదయాన్నే చేసుకోవచ్చులే పని అనుకుంటూ సోఫాలో వాలిపోయింది.

"అదేంటి ఇక్కడ పడుకున్నావు... నడుం పట్టేస్తుంది... లే వెళ్లి గదిలో పడుకో" మందలించింది పవిత్ర...

లాలిత్య లేచి వెళ్లక తప్పలేదు... అప్పటికే వ్యాస్ మంచం మీద వాలిపోయాడు...

లాలిత్య లోపలికి వెళ్ళగానే పవిత్ర తనే తలుపు వేసి బైట నుంచి గడియవేసింది...

లాలిత్య మంచం మీద వాలగానే మంచం కొద్దిగా కదలడంతో కళ్ళు తెరిచాడు వ్యాస్...

"సారీ డిస్టర్బ్ చేశాను... మీ అమ్మగారు గొడవ చేస్తున్నారు తప్పలేదు ఇక్కడికి రాక" అంది లాలిత్య...

బెడ్ లైట్ వెలుగులో ఆమె మొహంలో భావాలు చదవడానికి ప్రయత్నిస్తూ సూటిగా చూసిన అతని చూపులతో ఆమె చూపులు చిక్కుకుపోయాయి... చాలా కాలం తరువాత అతి సన్నిహితంగా తగిలిన ఆమె ఊపిరి అతనికి గిలిగింతలు పెట్టింది... పక్కకు వత్తిగిల్లి కళ్ళు మూసుకోబోతుంటే అతని విశాలమైన ఛాతీ విశ్రాంతి తీసుకోమన్నట్టు ఆహ్వానించింది ఆమెని...

ఎవరు ఎవరి దగ్గరకు చేరారో తెలియని ఓ మైకంలో ఇద్దరూ ఒకటయ్యారు...

ఆదివారం... పెసరట్లు బ్రేక్ ఫాస్ట్... డైనింగ్ టేబిల్ దగ్గర మూడుప్లేట్లు ఉండాల్సిన చోట నాలుగో ప్లేటు కనిపించి "ఇదెవరికత్తయ్యా" అడిగింది లాలిత్య.

నాకు అంటూ వచ్చింది సంధ్య...

"అరె నువ్వెప్పుడు వచ్చావే" ఆశ్చర్యంగా అడిగింది లాలిత్య...

"ఇప్పుడే" అంటూ స్నానం చేసి ఫ్రెష్ గా వచ్చిన వ్యాస్ కి కరచాలనం చేస్తూ గుడ్ మార్నింగ్ అంది సంధ్య...

"వెరీ గుడ్ మార్నింగ్" అంటూ లాలిత్య పక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాడు...

"రా సంధ్యా! పెసరట్లు చల్లారిపోతాయి" అంది పవిత్ర ప్లేట్లలో వేడి, వేడి పెసరట్లు అల్లం చట్నీ వేస్తూ...

చూపుడు వేలితో అల్లం చట్నీ తీసుకుని నాలిక్కి రాసుకుంటూ "చాలా బాగుందాంటీ చట్నీ... పుల్ల, పుల్లగా, తీయగా, కారంగా, అచ్చు వీళ్ల కాపురంలా" అంది సంధ్య కొంటెగా లాలిత్యని చూస్తూ.

లాలిత్య చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. కనురెప్పలు బరువుగా వాలిపోయాయి... వ్యాస్ ఆమె వైపు క్రీగంట చూసి మెత్తగా ఆమె పాదం మీద కాలివేలితో నొక్కాడు... అతని చర్యకి పులకించిపోతున్న శరీరాన్ని అదుపుచేసుకుంటూ కోపంగా చూస్తున్న లాలిత్య చెవులకి మంత్రాల్లా వినిపించాయి అత్తగారి మాటలు.

"ల్యాప్ టాప్ లు, ఐపాడ్ లు వచ్చి కాపురాల్ని పాడుచేస్తున్నాయి సంధ్యా! ఈసారి ఎవరన్నా విడాకులకోసం నీ దగ్గరకు వస్తే ముందు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ని బైట పారేయమని చెప్పు"

"అంతపని చేయనులే ఆంటీ... మీకాలం ఆ కాలమైతే రాబోయే కాలమంతా ఈ కాలమ్" అంది సంధ్య...

ఏ కాలమైనా భారతీయ వివాహవ్యవస్థని నాశనం చేసే మాయదారి కాలం కాకపోతే చాలు అంది పవిత్ర పెసరట్టు తుంచి నోట్లో పెట్టుకుంటూ.

వ్యాస్, లాలిత్య ఒకళ్ల మొహం ఒకళ్లు చూసుకుని ఫక్కున నవ్వుకున్నారు...

***




సాయంత్రం ఆరు గంటలకి ఆఫీస్ నించి వచ్చి హడావిడి గా బ్యాగ్ సర్దుకుంటున్న అద్వైత్ ని ఆశ్చర్యం గా చూసాను. ఏంటో అంత

బిజీ? అనుకుంటూ. నేనంత దగ్గరగా ఉన్నా పట్టించుకోకపోవడంతో నాక్కొంచెం అలకొచ్చింది. "హేయ్ డియర్! కోపమా? కామ్ గా ఉన్నావ్? ఏం లేదురా ముఖ్యమైన పని తగిలింది ఆఫీస్ లో. నేను అర్జెంట్ గా క్యాంప్ వెళ్ళాలి. ఎల్లుండి రాత్రికి వస్తాను." అన్నాడు నన్ను దగ్గరకి తీస్కుంటూ. నాకు చాలా బెంగగా అన్పించింది ఒక్కసారిగా. అది గమనించినట్టు "డోంట్ వర్రీ స్వీటీ, నాకూ నిన్ను వదిలి వెళ్లాలంటే బాధగానే ఉంది. వచ్చేస్తాగా... రాత్రి తోడుగా పని పిల్ల ఉంటుంది. ఒక్కదానివే బైటకి వెళ్లకు. అసలే తెల్లగా అందంగా ఉంటావు. దిష్టి తగులుతుంది. జాగ్రత్త మరి... టైమ్ కి తిను. ఎంజాయ్ ." నవ్వుతూ ముద్దు పెట్టుకుని ఫోన్లో ఎవరికో ఏదో పురమాయిస్తూ వెళ్లిపోయాడు అద్విత్. నేను గేట్ దాకా సాగనంపి వచ్చా.

అద్విత్ జీవితం లోకి నేను ప్రవేశించి పది నెలలవుతుందేమో! నన్ను ఎంత అపురూపంగా చూసుకుంటాడో? నేనంటే వాళ్ళింట్లో ఎవరికీ అంతగా ఇష్టం లేదు. అదీ కాక నేను అడుగు పెట్టిన వారానికే అద్విత్ కి ట్రాన్స్ఫర్ అవడం వాళ్ళకి ఇంకొంచెం కోపం పెంచింది. తనింట్లో వాళ్ళ ఇష్టానికి విరుద్ధంగా నన్ను తన జీవితం లోకి ఆహ్వానించిన అద్విత్ అంటే నాకూ చాలా ప్రాణం... నన్ను తీస్కొని కాకినాడ వచ్చేశాడు. ఇద్దరమే ఇంట్లో!. పొద్దస్తమానం తనకి (ఆఫీస్ టైమ్ లో తప్ప) నా తోడిదే లోకం. నేనొచ్చిన వేళా విశేషం ప్రమోషన్ రావడంతో నన్ను "ఏంజెల్" అనే పిలుస్తాడు.

ఏదో తిన్నాననిపించి పడుకున్నా గాని చాలా సేపటిదాకా నిద్ర పట్టలేదు. మర్నాడు కూడా రోజంతా భారంగానే గడిచింది. రోజూ ఉదయాన్నే ఇద్దరం వాకింగ్ కి వెళ్ళేవాళ్లం. ఏం చేస్తున్నాడో ఏంటో ? చాలా వెలితిగా అన్పిస్తోంది. సాయంత్రం మరీ చిరాగ్గా అన్పిస్తే ఇంటి ముందు పార్క్ కి వెళ్ళాను. అప్పుడప్పుడు వస్తూ ఉంటాం ఇక్కడికి నేను, అద్విత్. అక్కడ పిల్లలతో కాసేపు ఆడాను. చీకటి పడ్డంతో వాళ్ళూ బాయ్ అంటూ ఇళ్ళకి పరిగెత్తారు. నాకయితే ఇంటికి వెళ్ళ బుద్ధి కాలేదు. కాసేపు దూరంగా నడవాలన్పించి అలా నడుస్తూ ఓపెన్ ఎయిర్ థియేటర్ దాకా వెళ్లిపోయాను. లోపల చిన్న పిల్లల ప్రోగ్రాం అవుతోంటే చూస్తూ నిద్ర లోకి జారాను. నిద్రలో అద్విత్. "నీ కళ్ళు ఎంత బాగుంటాయో తెల్సా!" అంటూ నన్ను ప్రేమగా దగ్గరకి తీసుకుంటున్నాడు. మళ్ళీ కాసేపటికి "చీకట్లో ఒక్కదానివే ఎందుకు బైటకి వచ్చావ్?" అని కోపంగా అడుగుతున్నాడు. ఉలిక్కిపడి చూసే సరికి చాలా టైమ్ అయినట్టుంది. పనిమనిషి కంగారు పడుతుందో ఏంటో? దానికి తెలియదు కదా తను బైటకి వచ్చినట్టు. అద్విత్ ఫోన్ చేస్తే? బాబోయ్ త్వరగా ఇల్లు చేరాలి. అనుకుంటూ పరుగు లాటి నడకతో ఇంటి ముఖం పట్టాను. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. చాలా టైమే అయ్యుంటుంది. అమావాశ్య రోజులేమో చాలా చీకటి గా కూడా ఉంది. ఎందుకో భయమన్పించింది. హఠాత్తుగా టీవీ లో నిత్యం విన్పించే వార్తలు గుర్తొచ్చాయి..."ఆడవారిపై అత్యాచారాలు, అఘాయిత్యాలు" అంటూ! అద్విత్ పేపర్ చదువుతూ "సమాజం లో ఆడవాళ్ళకి రక్షణ లేదు. అర్ధరాత్రే కాదు పగటి పూట కూడా స్త్రీలు ఒంటరిగా బైటకి వెళ్లలేని దుస్థితి" అనే మాటలు జ్ఞాపకానికొచ్చాయి. "ఒక్కదానివే వెళ్లకు" అని మరీమరీ చెప్పినా నేను విన్పించుకోలేదు.. ఇప్పుడెలా ఇల్లు చేరేది? ఎంతకీ ఇల్లు రాదేంటి భగవంతుడా? అనుకుంటూ నడుస్తున్నా.

ఈలోపల వెనకేదో ఎండుటాకుల మీద అడుగులు పడుతున్న శబ్దం. ఎవరో ఫాలో అవుతున్నారు. గుండె చిక్కబట్టుకొని ఓరగా చూసా... నాలుగు నీడలు... అయిపోయింది ఇవాల్టితో నా పని. నిర్భయ గుర్తొచ్చింది. అద్విత్ నన్ను క్షమించు నీ మాట పెడ చెవిని పెట్టినందుకు. నన్ను ఎంతగా ప్రేమించావో? నువ్వొచ్చేసరికి నేనసలు ఈ లోకం లో ఉంటానో లేదో? నడక వేగం పెంచి

పరుగుగా మార్చాను. వెనకాల ఆకారాలు దగ్గరకి వచ్చేశాయి... బాగా... బాగా దగ్గరికి... ఇంక శక్తి లేదు... నా పని అయిపోయింది. కళ్ళు తిరిగినట్టయ్యి నించున్న చోటే కూలబడిపోయాను.

కళ్ళు తెరిచే సరికి నా చుట్టూ రౌండప్ చేసిన ఆకారాల్లో ఒకటి దగ్గరకి వచ్చి మా భాషలో "డోంట్ వర్రీ నీకేం భయం లేదు. ఇంతకీ మీ ఇల్లెక్కడ? నిన్ను జాగ్రత్త గా ఇల్లు జేరుస్తాం." అనేసరికి ఆశ్చర్యంతో బిత్తరచూపులు చూశాను. వాటికి అర్ధమైనట్టుంది "చూడమ్మా... ఈ ప్రపంచాన్ని చూసి ఒక ఆడదానిగా నువ్వు భయపడ్డం సహజమే... కాని మేం నీకు సాయం చేయడానికే వచ్చాం. నీ శీలానికి ఎటువంటి హాని తలపెట్టం. ఎందుకంటే మనం కుక్కలం... మనుషులం కాదు. మనకి విశ్వాసం తో పాటు నీతి కూడా ఒకటుంది.!" అంటూ ఇంటి వరకు వచ్చి దిగ బెట్టి వెళ్లిపోయాయి. నోరు లేకపోయినా ఈ మనుషుల కంటే మీరే ఎంతో నయం అని తరచుగా అనే అద్విత్ మాటలు గుర్తొచ్చాయి... మా జాతి సంస్కారం నన్ను ముగ్ధురాల్ని చేసింది. దేవుడా మా కుక్క జాతి ని ఎప్పుడూ ఇలాగే, ఇంత మంచిగానే ఉండనీ అనుకుంటూ లోపలికి అడుగు పెడుతున్న నన్ను పనిమనిషి దగ్గరికి తీస్కుని "ఏయ్ ఏంజెల్ ఎక్కడికి పోయావే చెప్పా పెట్టకుండా. వచ్చి అన్నం తిను" అంటూ ప్రేమగా కసురుకుంది. టేబిల్ మీద ఉన్న ఫోటోఫ్రేమ్ లో నన్నెత్తుకుని నవ్వుతున్న అద్విత్ ని చూసి గారాలు పోతూ తోకాడించాను.

***